మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 04 శుక్రవారం | అక్టోబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 18

Navabhoomi daily fallows..




# 11లక్షల కోట్లు ఆవిరి!

- భారీ నష్టాల్లో సూచీలు.. కుదేలైన ఇన్వెస్టర్లు
- భారీ నష్టాల్లోఆసియా మార్కెట్లతో పాటు మన మార్కెట్ సూచీలు
- నష్టాల్లో సెన్సెక్స్ 30 సూచీలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్, సన్‌ఫార్మా షేర్లు
- మినహా మిగిలిన అన్ని షేర్లూ..రిలయన్స్,బజాజ్,టాటా షేర్ల పరిస్థితి అంతే
- పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులే ఈ నష్టాలకు కారణం

2

**ముంబయి-నవభూమిబ్యూరో:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ట్రేడవుతున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆసియా మార్కెట్లతో పాటు మన మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో కొనసాగుతున్నాయి.

మధ్యాహ్నం 2.20 గంటల సమయానికి సెన్సెక్స్ 1800 పాయింట్ల నష్టంతో 82,465 వద్ద కొనసాగుతుండగా.. నిఫ్టీ 541 పాయింట్ల నష్టంతో 25,255 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది.

సెన్సెక్స్ 30 సూచీలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్, సన్‌ఫార్మా షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో కొనసాగుతున్నాయి. టాటా మోటార్స్, ఏషియన్ పెయింట్స్, ఎల్అండ్‌టీ, బజాజ్ ఫిన్‌సర్వ్, రిలయన్స్ షేర్లు భారీ నష్టాల్లో ట్రేడవుతున్నాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ



దాదాపు రూ.11 లక్షల కోట్లు ఆవిరైంది.

**కారణాలు ఇవే..**పశ్చిమాసియాలోని ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు ఎటువైపు దారితీస్తాయోనన్న ఆందోళనలు మదుపర్లలో నెలకొన్నాయి.

పశ్చిమాసియాలో నెలకొన్న భయాల నేపథ్యంలో ముడి చమురు ధరలు పెరగడం మరో కారణం. ఇన్నాళ్లు 70-71 డాలర్ల వద్ద

# 5 భాషలకు ప్రాచీన హోదా



- మరాఠీ, పాళి, ప్రాకృతం, అస్సామీ, బెంగాలీ భాషలకు ప్రాచీన హోదా
- రైల్వే ఉద్యోగులకు బోనస్.. కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలివే..
- చెన్నై మెట్రో ఫేజ్-2కు ఆమోద ముద్ర: 173 కి.మీల విస్తరణ
- రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కృషోన్నతి యోజన పథకాల ద్వారా సుస్థిర వ్యవసాయం, ఆహార భద్రత

2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. రైల్వే ఉద్యోగులకు బోనస్ ప్రకటించడంతో పాటు 'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబిల్ ఆయిల్- ఆయిల్ సీడ్స్'కు ఆమోదం తెలిపింది. దేశంలో మరో ఐదు భాషలకు ప్రాచీన హోదా కల్పించేందుకు ఆమోద ముద్ర వేసింది. దీంతో మరాఠీ, పాళి, ప్రాకృతం, అస్సామీ, బెంగాలీ భాషలకు ప్రాచీన హోదా దక్కనుంది. ఇప్పటికే తెలుగు సహా ఆరు భాషలకు ప్రాచీన హోదా ఉన్న విషయం తెలిసిందే. రాబోయే ఆరేళ్లలో నూనెగింజల ఉత్పత్తికి రూ.10,103 కోట్లు ఖర్చు చేయనుంది. వంట నూనె దిగుమతులపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది.

**రైల్వే ఉద్యోగులకు బోనస్**

పండగల నేపథ్యంలో రైల్వే ఉద్యోగులకు బోనస్ చెల్లించేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా 11.72 లక్షల మంది రైల్వే ఉద్యోగులకు 78 రోజుల ఉత్పాదక అనుసంధానిత బోనస్‌గా రూ.2028.57 కోట్లు చెల్లించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.

**చెన్నై మెట్రో ఫేజ్‌కు ఆమోద ముద్ర**

# క్రీడలపట్ల నిర్లక్ష్యం

- ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ క్రీడలను నిర్లక్ష్యం చేశారు
- అసహనం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రాబోయే రోజుల్లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతోపాటు
- అకాడమీని ప్రారంభించి క్రీడాకారులందరికీ శిక్షణ ఇస్తాం

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత క్రీడలను నిర్లక్ష్యం చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. సీఎం కప్ క్రీడా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగింది.


ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ. రాబోయే రోజుల్లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు అకాడమీని ప్రారంభించి క్రీడాకారులందరికీ శిక్షణ ఇస్తామని తెలిపారు. చదువే కాదు.. క్రీడల్లో రాణించినా మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. మతాలకు అతీతంగా దేశ ప్రతిష్ఠను పెంచేది క్రీడాకారులేనని సీఎం అన్నారు.

"25ఏళ్ల క్రితం హైదరాబాద్‌లో ఏషియన్ గేమ్స్ సహా ఇతర క్రీడలు నిర్వహించారు. అప్పుడు హైదరాబాద్ దేశానికి ఆదర్శంగా



నిలిచింది. కానీ, తెలంగాణ వచ్చిన తర్వాత క్రీడలను నిర్లక్ష్యం చేశారు. యువత డ్రగ్స్, గంజాయికి అలవాటు పడుతుంటే ఎంతో బాధపడ్డాం. కానీ, ప్రస్తుతం క్రీడలకు హైదరాబాద్ హబ్‌లా మారేలా కృషి చేస్తున్నాం. బాక్సింగ్‌లో రాణిస్తున్న నిఖత్ జరీన్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చాం. క్రికెటర్ సిరాజ్‌కు ఉద్యోగం ఇచ్చి.. ఆర్థికంగా ఆదుకునే ప్రయత్నం చేశాం. గతంలో రాష్ట్రానికి, దేశానికి పేరు తెచ్చిన

# మంత్రిపై నాగార్జున పరువునష్టం దావా



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** సినీ నటుడు అక్కినేని నాగార్జున కుటుంబాన్ని, వ్యక్తి గత విషయాలను ప్రస్తావిస్తూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే.

ఈ క్రమంలో నాగార్జున ఆమెపై పరువు నష్టం దావా వేశారు. తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠ దెబ్బతీసేలా సురేఖ వ్యాఖ్యలు చేశారంటూ నాంపల్లి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

మరోవైపు మంత్రి సురేఖ వ్యాఖ్యలపై చిత్ర పరిశ్రమ వర్గాలు మండిపడ్డాయి. బాధ్యతాయుతమైన పదవిలో ఒక మహిళా మంత్రిగా ఉండి, మరో మహిళ పేరు ప్రస్తావించడం, రాజకీయాలతో సంబంధం లేని అక్కినేని కుటుంబాన్ని వివాదంలోకి లాగడం సరైనది కాదంటూ సామాజిక మాధ్యమాల వేదికగా వరుస పోస్టులతో అసహనం వ్యక్తం చేశారు.

# భారత్‌లో మతస్వేచ్ఛపై దాడి

- మత స్వేచ్ఛపై 'యూఎస్‌సీఐఆర్ఎఫ్' నివేదిక
- యూఎస్ కమిషన్" విడుదల చేసిన తాజా నివేదిక
- 'యూఎస్‌సీఐఆర్‌ఎఫ్' అనేది రాజకీయ ఎజెండాతో కూడిన పక్షపాత సంస్థ..ఖండించిన భారత్

2





**న్యూయార్కు-నవభూమిబ్యూరో:**భారత్‌లో మత స్వేచ్ఛపై దాడి జరుగుతోందని "అంతర్జాతీయ మత స్వేచ్ఛపై యూఎస్ కమిషన్" విడుదల చేసిన తాజా నివేదికను భారత్ ఖండించింది. 'యూఎస్‌సీఐఆర్ఎఫ్' అనేది రాజకీయ ఎజెండాతో కూడిన పక్షపాత సంస్థగా పేర్కొంది. భారత్‌కు సంబంధించిన వాస్తవాలను ఆ సంస్థ తప్పుగా ప్రచారం చేస్తోందని, తమ దేశంపై ప్రేరేపిత కథనాలను కొనసాగిస్తోందని మండిపడింది.

"అంతర్జాతీయ మత స్వేచ్ఛపై యూఎస్ కమిషన్‌పై మా అభిప్రాయమేంటో తెలుసు. అది రాజకీయ ఎజెండాతో కూడిన పక్షపాత సంస్థ. భారత్ గురించి అవాస్తవాలను, ప్రేరేపిత కథనాలను వ్యాప్తి చేయడం కొనసాగిస్తూనే ఉంది" అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ స్పష్టం చేశారు. యూఎస్‌సీఐ ఆర్ఎఫ్ తాజాగా విడుదల చేసిన ఆ ప్రమాదకరమైన నివేదికను భారత్ తిరస్కరిస్తోం దన్నారు. తాజా నివేదిక ఆ సంస్థను మరింత దిగజార్చేందుకే ఉపయోగ పడుతుందన్నారు.

# వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించలేం

- ఇది చట్టబద్ధమైన అంశానికి మించిన సామాజిక సమస్య
- సమాజంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందన్న సుప్రీం
- మైనర్ కాని భార్యను లైంగికంగా బలవంతం చేస్తే అత్యాచారంగా పరిగణించలేం
- ఒకవేళ అలా చేస్తే దాంపత్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది
- వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించే అంశం సుప్రీం పరిధిలోకి రాదు

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే తగిన విధంగా శిక్షలు ఉన్నాయని వెల్లడించింది.

ఇది చట్టబద్ధమైన అంశానికి మించిన సామాజిక సమస్య అని.. సమాజంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని తెలిపింది. అందుకే దీనిపై ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు భాగస్వామ్యపక్షాలతో విస్తృత సంప్రదింపులు జరపాల్సిన అవసరముందని స్పష్టం చేసింది. ఈ మేరకు సర్వోన్నత న్యాయస్థానంలో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది.

వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించాలంటూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిని వ్యతిరేకించిన కేంద్ర ప్రభుత్వం.. మైనర్ కాని భార్యను లైంగికంగా బలవంతం చేస్తే అత్యాచారంగా పరిగణించలేమని పేర్కొంది. ఒకవేళ అలా చేస్తే దాంపత్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, వివాహ వ్యవస్థలోనూ తీవ్ర అవాంతరాలకు దారితీస్తుందని తెలిపింది. వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించే అంశం

# ఫ్యామిలీకి రక్షణ కవచం డిజిటల్ కార్డు

- హైదరాబాద్‌లో మీ భరతం పడతాం:తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి
- కంటోన్మెంట్‌లో కుటుంబ డిజిటల్ కార్డుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం
- భారాస నేతలపై ఘాటు వ్యాఖ్యలు..ఆ నేతల ఫాంహౌస్‌లు కూల్చాలా వద్దా..

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:**సంక్షేమ పథకాలు అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతోనే ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇవ్వాలని నిర్ణయించామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

రేషన్‌కార్డు కోసం గత పదేళ్లు ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగారన్నారు. సికింద్రాబాద్‌లోని కంటోన్మెంట్‌లో కుటుంబ డిజిటల్ కార్డుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా భారాస నేతలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి కుమారుల ఫాంహౌస్‌లు కూల్చాలా? వద్దా? చెప్పాలని ప్రశ్నించారు. అవి కూల్చుతామనే పేదలను అడ్డుపెట్టుకుని ధర్నాలు, దీక్షలు చేస్తున్నారన్నారు. "మూసీని అడ్డంపెట్టుకుని ఎంతకాలం బతుకుతారు.. హైదరాబాద్‌లో మీ భరతం పడతాం" అని భారాసను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు.



**ఎక్కడైనా రేషన్ తీసుకునే వెసులుబాటు**

"కేసీఆర్ అధికారంలో ఉంటే రేషన్‌కార్డు రాదని ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారు. కొత్తగా రేషన్‌కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదు. సంక్షేమ పథకాల అమలుకు డిజిటల్ కార్డులు అవసరం. ప్రతి పేదవాడికీ

# 'హెలెనా' విధ్వంసం..

- 200కు పెరిగిన మృతుల సంఖ్య



**ఫ్లోరిడా-నవభూమి:** అతి తీవ్రమైన హరికేన్ 'హెలెనా' ఇటీవల ఆగ్నేయ అమెరికాను కుదిపేసింది. ఫ్లోరిడా, జార్జియా, నార్త్ కరోలినా, సౌత్ కరోలినా, వర్జీనియా రాష్ట్రాల్లో తీవ్ర ప్రభావం చూపింది.ఈ పెను తుపాను ధాటికి మృతిచెందిన వారి సంఖ్య 200కు పెరిగినట్లు అధికారులు వెల్లడించారు.జార్జియా, ఉత్తర కరోలినాల్లో మరిన్ని మరణాలు వెలుగుచూసినట్లు తెలిపారు. ప్రకృతి విపత్తు కారణంగా బిలియన్ల డాలర్ల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. జార్జియా, సౌత్ కరోలినా, నార్త్ కరోలినా, టెనస్సీ గుండా సాగిన హరికేన్ ప్రతాపానికి వేలాది చెట్లు నేల కూలిపోయాయి. ఇళ్లు ధ్వంసమయ్యాయి. 2005లో హరికేన్ 'కత్రినా' తర్వాత అమెరికాలో అత్యంత బీభత్సం సృష్టించిన ఈ పెను తుపాను 'హెలెనా'గా పేర్కొంది.

# కేటీఆర్, హరీశ్‌రావులపై కేసు నమోదు



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులపై సైబరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో కొండా సురేఖతో ఉన్న ఫొటోలపై ట్రోలింగ్ చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు పేర్కొన్నారు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలు యూట్యూబ్ ఛానల్స్‌పై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



## జానీ మాస్టర్‌కు మధ్యంతర బెయిల్ 2

# నూతన విధానాలతో ఆర్థికాభివృద్ధి


- జనవరి నుంచి అమల్లోకి పీ4 విధానం: సీఎం చంద్రబాబు
- 15శాతం గ్రోత్ రేట్ లక్ష్యంతో ప్రభుత్వం పనిచేయాలి
- వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగం, సేవలరంగంలో వృద్ధిపై సీఎం చంద్రబాబు సమీక్ష

2

**అమరావతి-నవభూమిబ్యూరో:** నూతన పాలసీలతో అన్ని రంగాలను గాడిన పెట్టి మళ్లీ ఆర్థిక వృద్ధి సాధించాలని సీఎం చంద్రబాబు అన్నారు. 15శాతం గ్రోత్ రేట్ లక్ష్యంతో ప్రభుత్వం పనిచేయాలని అధికారులకు సూచించారు.

వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగం, సేవలరంగంలో వృద్ధిపై సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయా శాఖల అధికారులు గత పదేళ్లలో పరిస్థితులను వివరించారు. గత ప్రభుత్వం విధ్వంసకర విధానాలతో అన్ని రంగాలు తిరోగమనంలోకి వెళ్లాయని దీంతో ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యిందని సీఎం అన్నారు. ప్రతి శాఖలో కొత్త పాలసీలు తీసుకొస్తున్నామని, వీటిని సమర్థవంతంగా అమలు చేసి ఆర్థిక పురోగతి సాధించాలని సీఎం అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు ప్రజలపై అదనపు భారం లేకుండా ప్రభుత్వ ఆదాయం పెంచే విధానాలను అమలు చేయాలని సీఎం ఆదేశించారు. వ్యవసాయ రంగంలో సమగ్ర యంత్రీకరణ ద్వారా సాగు ఖర్చులు తగ్గించవచ్చన్నారు. ప్రభుత్వం అంటే పథకాలు ఇవ్వడం మాత్రమే కాదని, ఆయా రంగాలను బలోపేతం చేసి ప్రజల ఆదాయాలను పెంచడం ముఖ్యమన్నారు.

2014 తరువాత విభజన కష్టాలు ఉన్నా.. నాడు తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్రం 13.7



## 7న ఢిల్లీకి ఏపీ సీఎం చంద్రబాబు

**అమరావతి-నవభూమి:** ఏపీ సీఎం చంద్రబాబు ఈ నెల 7న ఢిల్లీ వెళ్లనున్నారు. ప్రధాని మోదీతో పాటు పలువురు కేంద్రమంత్రులతో ఆయన భేటీ కానున్నారు. రాజధాని అమరావతికి నిధులు, మరికొన్ని ఇతర అంశాలకు కేంద్ర సాయాన్ని కోరే అవకాశముంది. మరోవైపు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమైన రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై సీఎం చర్చించనున్నారు.

## జర్నలిస్టు చిలుక ప్రవీణ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



**హైదరాబాద్‌-నవభూమి:** తెలంగాణలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న జర్నలిస్టులపై కాంగ్రెస్ గూండాలు దాడులకు పాల్పడుతున్న సంగతి తెలిసిందే. తాజాగా జర్నలిస్టు చిలుకా ప్రవీణ్‌పై కాంగ్రెస్ గూండాలు దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచారు. కాగా, కాంగ్రెస్ గుండాల దాడిలో గాయపడ్డ జర్నలిస్టు చిలుక ప్రవీణ్‌ను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి పరామర్శించారు. హైదరాబాద్ పట్టణంలోని సోమాజిగూడ యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ప్రవీణ్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకొన్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యేలు డా.గాదరి కిశోర్ కుమార్, బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మరోవైపు చిలుక ప్రవీణ్‌పై దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఖండించారు.



## కొండా సురేఖపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



**హైదరాబాద్‌-నవభూమి:** బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తోపాటు టాలీవుడ్‌లోని పలువురు హీరోయిన్లపై తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తెలంగాణ మంత్రి కొండా సురేఖపై ఆ పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందులోభాగంగా గురువారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు ఫిర్యాదు చేశారు.
మంత్రి బుధవారం చేసిన ఈ వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని వారు విమర్శించారు. ఇటువంటి నిరాధారమైన ఆరోపణలు చేసిన కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. అయితే కొండా సురేఖ చేసిన నిరాధారమైన ఆరోపణలు వెనక్కి తీసుకొని.. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.తెలంగాణ అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. మాజీ మంత్రి కేటీఆర్‌తోపాటు టాలీవుడ్‌లోని పలువురు హీరోయిన్లపై ఆమె అభ్యంతరకర వ్యాఖ్యాలు చేశారు. ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు అటు మీడియాలో ఇటు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో టాలీవుడ్‌లోని అగ్ర హీరోలు సైతం వెంటనే ఆ వ్యాఖ్యలపై స్పందించారు. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను వారంతా ముక్తకంఠంతో ఖండించారు.ఇక బీఆర్ఎస్ నేతలు సైతం కొండ సురేఖ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. దీంతో కొండ సురేఖ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని.. అలాగే ఆమె బహిరంగ క్షమాపణలు చెప్పాలంటూ వారు డిమాండ్ చేశారు. అటువంటి వేళ కొండా సురేఖ గురువారం మీడియా ముందుకు వచ్చి.. తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. అయితే కేటీఆర్ విషయంలో మాత్రం తగ్గదేలేదని ఆమె స్పష్టం చేశారు.
మరోవైపు గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో మేయర్ డిప్యూటీ మేయర్ పీఠాలను సైతం ఆ పార్టీనే కైవసం చేసుకుంది. అయితే ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రాష్ట్రంలో తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్ కొలువు తీరింది. ఆ క్రమంలో రేవంత్ రెడ్డి చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీ గూటికి చేరారు.
వారిలో జీహెచ్ఎంపీ మేయర్ జి. విజయలక్ష్మీతోపాటు డిప్యూటీ మేయర్ సైతం ఉన్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీలో మిగిలిన కార్పొరేటర్లు.. గురువారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి.. మంత్రి కొండా సురేఖపై ఫిర్యాదు చేశారు. తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన ఆమెపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని పోలీసులకు ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు.

## భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి



**హైదరాబాద్‌-నవభూమి:** ఓ ఆర్ఆర్ నుంచి రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) వరకు ప్రధానమైన నాలుగు రహదారులు విస్తరణ విషయంలో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం లేదా భూమి కేటాయించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భూ నిర్వాసితులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని హెచ్చరించారు. పేద రైతుల స్థలాలను గుంజుకుని రైతులను బిచ్చగాళ్లను చేస్తానంటే ఎవరు ఊరుకోరని ఆయన హెచ్చరించారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని అన్నారు. హైదరాబాద్ ధర్నాచౌక్‌లో ట్రిపుల్ ఆర్ రోడ్డు విస్తరణ సందర్భంగా భూనిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా స్థలాలు కోల్పోయిన రైతులకు ప్రత్యామ్నాయంగా స్థలాలు, ఆర్థిక సహకారాన్ని అందించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ట్రిపుల్ ఆర్ చుట్టుపక్కల ఉన్న రైతులంతా పెద్ద సంఖ్యలో ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఈ ధర్నాలో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్,బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలా శేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎంపీ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య , మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, ఐక్యవేదిక నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ సందర్భంగా భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం, స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా రైతులను పట్టించుకోకుండా బిచ్చగాళ్లను చేస్తామంటేఎవరూ ఊరుకోరని ఈటల రాజేందర్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వస్తే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లి రీజనల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులకు తన వంతు న్యాయం చేస్తానని ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు.

## నిర్మల్ జిల్లాలో భారీగా అల్ఫాజోలం, క్లోరోహైడ్రేట్ పట్టివేత

**నిర్మల్-నవభూమి:** నిర్మల్ జిల్లా కేంద్రంలో రూ.43 లక్షల విలువ చేసే అల్ఫాజోలం క్లోరోహైడ్రేట్‌ను ఎక్సైజ్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. అల్ఫాజులం, క్లోరోహైడ్రేట్ నిల్వ చేశారనే విశ్వసనీయ సమాచారం మేరకు నిర్మల్‌లోని ద్వారకా నగర్‌లో గంధం శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో సోదాలు చేపట్టారు. అతడి వద్ద నుంచి 3.3 కిలోల అల్ఫాజోలం, అలాగే శాంతినగర్‌లోని ఓ గోదాంలో నిల్వ చేసిన 728 క్లోరోహైడ్రేట్ నిల్వలను స్వాధీనం చేసుకున్నారు.
నిందితుడు గంధం శ్రీనివాస్ గౌడ్‌కు సోలాపూర్ శీను అలియాస్ భాయ్ అల్ఫాజులంను, రాజస్థాన్‌కు చెందిన రూప్ సింగ్ అనే వ్యక్తి క్లోరోహైడ్రేడ్‌ను గత కొంతకాలంగా సప్లై చేస్తున్నారు. వీటితో శ్రీనివాస్ గౌడ్ కల్తీకల్లు వ్యాపారం చేయడమే కాకుండా అల్ఫాజోలం, క్లోరోహైడ్రేట్‌ను ఇతరలకు అమ్ముతున్నాడని పోలీసులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సెలవులకు ఊరెళ్తున్నారా.. ముందుగా ఇది తెలుసుకోండి..



**హైదరాబాద్‌-నవభూమి:** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా స్కూళ్లకు దసరా సెలవులు ప్రకటించింది. దీంతో పిల్లలతో సహా.. పలు కుటుంబాలు దసరా సెలవులకు తమ తమ సొంతూళ్లకు, బంధుమిత్రుల ఊళ్లకు పయనమవుతున్నారు. ప్రజలంతా దసరా సెలవులను ఎంజాయ్ చేయాలని ప్లాన్ చేస్తుంటే.. మరోవైపు కేటుగాళ్లు తమకు అనువైన సమయం రానే వచ్చిందంటూ సిద్ధమవుతున్నారు. అవును, ఊళ్లకు వెళ్లే వారి ఇళ్లే టార్గెట్‌గా దొంగలు దోపిడీకి పాల్పడే అవకాశం ఉంది. తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా దోపిడీలు జరిగే అవకాశం ఉంది. అందుకే ఊళ్ల ప్రయాణాలు సాగించే వారిని ఉద్దేశించి తెలంగాణ పోలీసులు కీలక ప్రకటన జారీ చేశారు. దసరా సెలవుల్లో ఊళ్లకు వెళ్లే వారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్లేవారు తమ ఇంట్లో చోరీ జరుగకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎంతో కష్టపడి సంపాదించిన డబ్బులు, బంగారం దొంగలపాలవకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, దొంగతనాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజలకు పోలీసులు చెబుతున్నారు. ఆ సూచనలివే..

1.డబ్బు, విలువైన ఆభరణాలు ఇంట్లో ఉంచి వెళ్ళకూడదు.
2. రాత్రివేళ అనుమానాస్పదంగా సంచరించేవారి గురించి పోలీసులకు వెంటనే సమాచారం అందించాలి.
3. తాళం వేసిన ఇళ్లను అపరిచిత వ్యక్తులు ఉదయం వేళ వెతికినట్లు కనిపిస్తే అప్రమత్తం కావాలి.
4. విలువైన వస్తువులను పక్కింటి వారికి ఇచ్చి నమ్మి మోసపోవద్దు. ఇరుగు పొరుగు వారిని తమ ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పి వెళ్లడం మంచిది.
5. వీలైనంత త్వరగా ప్రయాణం ముగించుకుని వచ్చేలా చూసుకోవాలన్నారు.
6. పక్కింటి వారి ద్వారా ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి.
7. ఇంట్లో కుటుంబ సభ్యులు బయటకు వెళ్ళినప్పుడు ఇంట్లో ఉన్న మహిళలు, వృద్ధుల వద్దకు అపరిచితులు సమాచారం కావాలంటూ వస్తే నమ్మవద్దు. వారిపట్ల ఏమరుపాటుగా ఉండవద్దు.
8. ఖరీదైన వస్తువులను బ్యాంక్ లాకర్‌లో పెట్టుకోవాలి.
9. CCTV కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
10. కొత్తవారి కదలికలపై, అనుమానితుల సమాచారం పోలీసులకు అందించి దొంగతనాల నివారణకు సహకరించాలి.
11. చుట్టు పక్కల వారి సెల్‌ఫోన్ నంబర్లు దగ్గర ఉంచుకోవాలి.
12. బయటికెళ్లేటప్పుడు తాళలను ఒకటికి రెండు సార్లు సరిచూసుకోండి.

## మూసీ కూల్చివేతలకు బ్రేక్.. ఎందుకంటే



**హైదరాబాద్‌-నవభూమి:** మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌లో భాగంగా మూసీ పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపుకు బ్రేక్ పడింది. శంకర్ నగర్, మూసానగర్‌లో స్థానికులు ఇళ్ళు ఖాళీ చేయకపోవడంతో అధికారులు కూల్చివేతలను నిలిపివేశారు. ఈ కూల్చివేతలకు రెవెన్యూ అధికారులు తాత్కాలిక బ్రేక్ ఇచ్చారు. ఓల్డ్ మలక్‌పేట్, శంకర్‌నగర్‌లో 450 ఇళ్లను అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు 140 ఇళ్లు కూల్చివేసి బాధితులను చంచల్‌గూడలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లకు తరలించారు.
ఖాళీ చేసిన ఇళ్లను ఇప్పటి వరకు అధికారులు కూల్చివేశారు. అయితే కొంతమంది బాధితులు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించినప్పటికీ ఖాళీ చేయని పరిస్థితి. హైదరాబాద్ శివారులో డబుల్ బెడ్‌రూంలు కేటాయించారని.. ఒక్కో ఇంట్లో 16 మంది ఉన్న వారికి డబుల్ బెడ్ రూంలు ఏం సరిపోతాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారంతా ఇళ్లు ఖాళీ చేయని నేపథ్యంలో అధికారులు కూల్చివేతలకు కాస్త బ్రేక్ ఇచ్చారు. అయితే బాధితులకు డబుల్ బెడ్ రూమ్‌తో పాటు 25 వేల సహాయాన్ని ప్రభుత్వం అందజేస్తున్న విషయం తెలిసిందే.కాగా.. ఆపరేషన్ మూసీలో భాగంగా రెండు రోజుల క్రితమే మూసీపరివాహక ప్రాంతాల్లో ఇళ్లను కూల్చివేసే పనులను ప్రారంభించారు రెవెన్యూ అధికారులు. %=దీ- ళ% అని రాసి, ఇళ్ళు ఖాళీ చేసిన వాటిని అధికారులు కూల్చివేస్తున్నారు. ఎలాంటి అవాంతరాలు జరుగకుండా భారీ బందోబస్తు నడుమ ఇళ్లను కూల్చివేశారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌ను వరదల నుంచి రక్షించేందుకు, ఆక్రమణకు గురైన మూసీ నది పరివాహక ప్రాంతాలను పునరుద్ధరించి, కాలుష్య కోరల నుంచి మూసీని కాపాడేందుకు ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది.అధికారులు ముందుగా మూసీ నది ఎఫ్‌టీఎల్ పరిధిని సర్వే చేశారు. అందులో దాదాపు 16 వేల నివాసాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు తేలింది.
అందులో పేద, మధ్యతరగతి వారు నివసిస్తున్నారు. దీంతో ప్రభుత్వం.. మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న పేదలకు ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించింది. అందుకోసం ఇప్పటికే జీఓ కూడా జారీ చేసింది. అయితే డబుల్ బెడ్రూమ్‌లు ఎవరికి ఇవ్వాలనే దానిపై తాజాగా రెవెన్యూ అధికారులు సర్వే చేసి.. గుర్తించి ఇళ్లపై అని రాశారు. అయితే పలు ప్రాంతాల్లో మార్క్ సర్వే చేసిన అధికారులు స్థానికులు అడ్డుకున్నారు. అధికారులపై తిరగబడ్డారు. దీంతో పలు ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణ నెలకొంది. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ పలువురు స్థానికులు ఆందోళనకు దిగారు. మూసీ రివర్ బెడ్‌లో ఉన్న ఇళ్లు, వాటి యాజమానుల వివరాలు నమోదు చేసేందుకు వచ్చిన అధికారులను పలు ప్రాంతాల్లో నివాసితులు అడ్డుకున్నారు. చివరకు పోలీసు బందో బస్తు నడుమ మార్క సర్వేను అధికారులు కొనసాగించారు.

## ఫ్యామిలీకి రక్షణ కవచం డిజిటల్ కార్డు

**(1వపేజీతరువాయి)**కార్డు అందించాలనే లక్ష్యంతో ఉన్నాం. రేషన్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఉపయోగపడుతుంది. ఇది కుటుంబానికి రక్షణ కవచం. దీనిలో ఆరోగ్యపరమైన వివరాలు కూడా పొందుపరుస్తాం. గతంలో ఏ వైద్యం అందింది.. ఏ మందులు వాడారు అనేది వైద్యులకు సులభంగా అర్థమవుతుంది. గ్రామాల నుంచి ఉపాధి కోసం పట్టణాలు, నగరాలకు వచ్చిన పేదలు ఉన్న ప్రాంతంలోనే రేషన్ తీసుకునే వెసులుబాటు కలుగుతుంది. నియోజకవర్గానికి రెండు చోట్ల దీన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నాం. దీనిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు సరిదిద్దుతాం" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారు**

అధికారం కోల్పోవడంతో విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని పరోక్షంగా కేటీఆర్, హరీశ్‌రావును ఉద్దేశించి సీఎం అన్నారు. "నిరుద్యోగుల ఉసురు పోసుకున్నారు.. అందుకే మీ ఉద్యోగం వారు తీశారు. అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లో 30 వేలమందికి ఉద్యోగాలు ఇచ్చాం. డిసెంబర్‌లోపు మరో 30వేలకు పైగా ఇవ్వాలని నిర్ణయించాం. టీచర్ల నియామకాలు చేపట్టబోతున్నాం. త్వరలో ఎల్బీ స్టేడియంలో 11వేల మందికి నియామక పత్రాలు ఇవ్వబోతున్నాం. హైదరాబాద్‌లోని ట్రాఫిక్, వరద సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతుంటే బావ, బావమరిది బురదచల్లుతూ తిరుగుతున్నారు. కిరాయి మనుషులతో మీరు చేసే హడావిడిని తెలంగాణ సమాజం నిశితంగా గమనిస్తోంది.


**దోచుకున్న సొమ్ము నుంచి రూ.500కోట్లు ఇవ్వండి**

పేదలకు అన్యాయం జరిగిందని ఏడుస్తున్నారు కదా.. రాష్ట్రాన్ని దోచుకున్న నిధులు రూ.1500 కోట్లు మీ పార్టీ ఖాతాలో ఉన్నాయి. వాటి నుంచి రూ.500 కోట్లు మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు పంచిపెట్టండి. అధికారంలోకి రాకముందు వేసుకునేందుకు మీకు చెప్పులు కూడా లేవు కదా.. ఈరోజు పార్టీ ఖాతాలోకి రూ.1500 కోట్లు ఎలా వచ్చాయి. హైడ్రాపై అసెంబ్లీలో చర్చ జరగలేదా? ఆరోజు ఎందుకు సూచనలు చేయలేదు? ప్రత్యామ్నాయంగా ఏం చేయాలో చెప్పండి. వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మూసీ పరివాహక ప్రాంత పేదలకు 15వేల ఇళ్లు కేటాయింపునకు ఆదేశాలు ఇచ్చాం.

**ఈటల రాజేందర్.. ప్రధాని వద్దకు వెళదాం**

అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తాం.. వచ్చి సలహాలు ఇవ్వండి. చిన్నపాటి వర్షానికి మునిగిపోతున్న నగరాన్ని కాపాడుకుందాం. కేటీఆర్, హరీశ్‌రావు.. సచివాలయానికి రండి.. 4 రోజులు చర్చిద్దాం. ఈ ప్రభుత్వం పేదల కన్నీళ్లు చూడదలచుకోలేదు. మూసీ నిర్వాసితులను ఎలా ఆదుకోవాలో సూచనలు ఇవ్వండి. కిషన్‌రెడ్డి, ఈటల.. మీకు మోదీ చేపట్టిన సబర్మతి రివర్ ఫ్రంట్ కావాలి కానీ, మూసీ రివర్ ఫ్రంట్ వద్దా? ఈటల రాజేందర్.. మీ నేతృత్వంలో నిధుల కోసం ప్రధాని మోదీ వద్దకు వెళదాం. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను తీసుకురండి.. కేంద్రం నుంచి రూ.25వేల కోట్లు ఇప్పించండి. హైదరాబాద్ నగరంలో చెరువులను ఆక్రమించింది ఎవరో తేల్చుదాం" అని సీఎం అన్నారు.

## విలన్ పాత్రధారి మోహన్‌రాజ్ కన్నుమూత



**హైదరాబాద్-నవభూమి:**'లారీ డ్రైవర్' సహా తెలుగు చిత్రాల్లో తనదైన విలనిజాన్ని పండించిన నటుడు మోహన్‌రాజ్ (72) ఇక లేరు.'కిరిక్కాడాన్ జోస్' పేరుతో మలయాళంలో వందల చిత్రాల్లో నటించి మెప్పించిన ఆయన తిరువనంతపురంలో తుది శ్వాస విడిచారు. నటుడు, దర్శకుడు, పి.దినేశ్ పనికర్ ఈ విషయాన్ని తెలియజేస్తూ విచారం వ్యక్తం చేశారు. మోహన్‌రాజ్‌కు భార్య ఉష, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత నాలుగు రోజులుగా తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న మోహన్‌రాజ్‌ను వెంటిలేటర్‌పై ఉంచారు. గురువారం మధ్యాహ్నం పరిస్థితి విషమించడంతో తుది శ్వాస విడిచినట్లు వైద్యులు తెలిపారు. గత కొంతకాలంగా పార్కిన్సన్స్‌తో బాధపడుతున్న మోహన్‌రాజ్‌కు ఇటీవల గుండె పోటు కూడా వచ్చింది. చికిత్స నిమిత్తం ఆయన్ను చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో ఇంటికి తీసుకెళ్లిపోవాల్సిందిగా వైద్యులు సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ను తిరువనంతపురంలోని కంజిరంకులం తీసుకురాగా, అక్కడే కన్నుమూశారు.'కిరిక్కాడాన్ జోస్'గా మలయాళంలో మోహన్‌రాజ్ చాలా ఫేమస్. 1989లో సిబి మలయిల్ దర్శకత్వంలో వచ్చిన 'కిరీదామ్'తో మంచి పేరు తెచ్చుకున్నారు. సిబి మలయిల్ తను తీయబోయే చిత్రానికి 6 అడుగులకు పైగా ఎత్తు, 100 కిలోల భారీ శరీరం కలిగిన కొత్త విలన్ కోసం వెతుకుతుండగా మోహన్‌రాజ్ కనిపించారు.

## 11లక్షల కోట్లు ఆవిరి

**(1వపేజీ తరువాయి)**కొనసాగిన బ్యారెల్ ముడి చమురు ధర 75 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌కు సంబంధించి నిబంధనలను ఇటీవల సెబీ కఠినతరం చేయడం కూడా మార్కెట్ నష్టాలకు మరో కారణం.ఇటీవల చైనా ప్రభుత్వం ప్రకటించిన ఉద్దీపన చర్యలతో ఆ దేశానికి చెందిన స్టాక్స్ రాణిస్తున్నాయి. దీంతో భారత్ నుంచి పెట్టుబడులు తరలిపోతున్నాయన్న ఆందోళనలూ మరో కారణం.

## క్రీడలపట్ల నిర్లక్ష్యం

**(1వపేజీ తరువాయి)**క్రీడాకారుల కుటుంబాలను ఆదుకుంటాం. అండర్-17 క్రికెట్ టీమ్‌ను తెలంగాణ ప్రభుత్వం దత్తత తీసుకుంది. ఒలింపిక్స్‌లో భారత్ పరిస్థితిని యువత ఆలోచించాలి. అందుకే తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. కులం, మతంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ కలిసే చోటు క్రీడా మైదానాలు మాత్రమే" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## 5 భాషలకు ప్రాచీన హోదా

**(1వపేజీ తరువాయి)**చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ట్రాఫిక్‌ను సులభతరం చేయడంతో పాటు ఆర్థిక వృద్ధిని మెరుగుపరచడంలో సహాయపడుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఫేజ్-2లో భాగంగా రూ.63,246 కోట్లతో దాదాపు 119కి.మీల మేర ఈ భారీ ప్రాజెక్టు చేపట్టేందుకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు కింద మూడు కారిడార్లుగా మొత్తం 120 స్టేషన్లు నిర్మించనున్నారు. 2027 నాటికి పూర్తి ఈ ప్రాజెక్టు పూర్తి చేసేలా ప్లాన్ చేస్తున్నారు. ఫేజ్-పూర్తయి ఆపరేషన్‌లోకి వస్తే.. చెన్నై నగరంలో మొత్తంగా మెట్రో రైల్ నెట్‌వర్క్ 173 కి.మీకు చేరుకోనుంది.
వ్యవసాయ సంబంధిత పథకాలన్నింటినీ రెండు ప్రత్యేక స్కీమ్‌ల కిందకు తీసుకొచ్చింది. పీఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కృషోన్నతి యోజన పథకాల ద్వారా సుస్థిర వ్యవసాయం, ఆహార భద్రత సాధించేందుకు రూ.లక్ష కోట్లతో అమలు చేయనుంది. పీఎం ఆర్‌కేవీవై పథకం సుస్థిర వ్యవసాయన్ని ప్రోత్సహించగా.. కృషోన్నతి యోజన ఆహార భద్రత, వ్యవసాయ స్వయం సమృద్ధికి తోడ్పడనుంది. మొత్తం 18 పథకాలను ఈ రెండు స్కీమ్‌ల కింద రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేస్తారు.
దేశీయ అవసరాల్లో దాదాపు 50శాతానికి పైగా వంట నూనెల కోసం భారత్ దిగుమతులపైనే ఆధారపడుతోంది. దీంట్లో స్వయం సమృద్ధి సాధించేందుకు కేంద్రం ప్రణాళిక రూపొందించింది. 2022-23 నాటికి 39 మిలియన్ టన్నుల నూనెగింజలను దేశంలో ఉత్పత్తి చేస్తుండగా.. 2030-31 నాటికి 69.7 మిలియన్ టన్నులకు పెంచడమే లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే, సాగును అదనంగా 40 లక్షల హెక్టార్లు పెంచేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

## వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించలేం

**(1వపేజీ తరువాయి)**సుప్రీం కోర్టు పరిధిలోకి రాదని.. అన్ని రాష్ట్రాలు, భాగస్వామ్య పక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా దీనిపై ఓ నిర్ణయం తీసుకోలేమని వెల్లడించింది.
వివాహం చేసుకోవడం వల్ల మహిళ 'సమ్మతి' తొలగిపోయినట్లు కాదని, దాన్ని ఉల్లంఘిస్తే తగువిధంగా శిక్షలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం ఉద్ఘాటించింది. వివాహిత సమ్మతిని రక్షించేందుకు చట్టపరమైన నిబంధనలు సహా ఇతర పరిష్కార మార్గాలను పార్లమెంట్ అందించిందని తెలిపింది. మహిళా స్వేచ్ఛ, గౌరవం, హక్కులను రక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అఫిడవిట్‌లో స్పష్టం చేసింది.


## నూతన విధానాలతో ఆర్థికాభివృద్ధి

**(1వపేజీ తరువాయి)**శాతం గ్రోత్ రేట్ సాధించిందని గుర్తు చేశారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వ రివర్స్ నిర్ణయాలతో వృద్ధి రేటు 10.59 శాతానికి తగ్గిందని సీఎం అన్నారు. 2019లో తెలంగాణతో పోల్చితే ఏపీ జీఎస్‌డీపీలో వ్యత్యాసం కేవలం 0.20 శాతం ఉండేదని, ఆ వ్యత్యాసం 2024కు 1.5 శాతానికి పెరిగిందని వివరించారు. 2014-15 మధ్య ఏపీ ప్రజల తలసరి ఆదాయం రూ.93,903 ఉండగా నాటి తెలుగుదేశం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో తలసరి ఆదాయం 2019 నాటికి రూ.1,54,031కి పెరిగిందని తెలిపారు.
దక్షిణాది రాష్ట్రాల్లో ..ఏపీ తలసరి ఆదాయంలో 5వ స్థానంలో ఉందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ శాఖలు విజన్ సిద్ధం చేసుకుని నిర్దిష్ట లక్ష్యాలతో పనిచేయాలని అధికారులకు సూచించారు. జనవరి నుంచి పీ4 విధానాన్ని ఆచరణలోకి తెస్తున్నామన్నారు. ఈ విధానం ద్వారా సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్నవారు ఆర్థికంగా అట్టడుగున ఉన్న 10 శాతం మందిని పైకి తెసుకువచ్చేందుకు సహాయం చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే పథకాలతో పాటు..సంపన్నులు, సంస్థలు సీఎస్ఆర్ ద్వారా పేదల జీవన ప్రమాణాలు పెంచడానికి, వారికి అవకాశాలు కల్పించడానికి మెంటార్ లా దోహదపడాలన్నారు.

## జానీ మాస్టర్‌కు మధ్యంతర బెయిల్

**హైదరాబాద్‌-నవభూమిబ్యూరో:**అత్యాచార ఆరోపణలతో అరెస్టయిన డ్యాన్స్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు అయింది. జాతీయ అవార్డుల కార్యక్రమానికి హాజరవ్వాలని అందుకుగాను బెయిల్‌కు దరఖాస్తు చేసుకోగా..పరిశీలించిన రంగారెడ్డి న్యాయస్థానం ఈనెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ బెయిల్ మంజూరు చేసింది. అక్టోబరు 10వ తేదీ ఉదయం 10 గంటలకు కోర్టు ఎదుట హజరు కావాలని న్యాయస్థానం ఆదేశించింది. రెండు లక్షల చొప్పున రెండు పూచికత్తులు సమర్పించాలని పేర్కొంది. ఈ సమయంలో మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వొద్దని, అలాగే మరో మారు మధ్యంతర బెయిల్ పిటిషన్ దాఖలు చేయకూడదని కోర్టు ఆదేశించింది.జానీ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడంటూ ఆయన అసిస్టెంట్ ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. "2017లో జానీ మాస్టర్ పరిచయమయ్యాడు. 2019లో అతని బృందంలో సహాయ నృత్య దర్శకురాలిగా చేరాను. ముంబయిలో ఓ సినిమా చిత్రీకరణ నిమిత్తం జానీ మాస్టర్‌తో పాటు నేను, మరో ఇద్దరు సహాయకులం వెళ్లాం. అక్కడ హోటల్‌లో నాపై జానీ మాస్టర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే పని నుంచి తొలగిస్తానని, సినిమా పరిశ్రమలో ఎప్పటికీ పని చేయలేవని బెదిరించాడు. దీన్ని అవకాశంగా తీసుకుని.. హైదరాబాద్ నుంచి ఇతర నగరాలకు సినిమా చిత్రీకరణకు తీసుకెళ్లిన సందర్భాల్లో పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. వేధింపులు భరించలేక జానీ మాస్టర్ బృందం నుంచి బయటకొచ్చేశాను. అయినా సొంతంగా పని చేసుకోనివ్వకుండా, ఇతర ప్రాజెక్టులు రానీయకుండా ఇబ్బంది పెట్టాడు" అని ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3
హైదరాబాద్
శుక్రవారం
04 , అక్టోబర్ , 2024



## డ్రెస్సింగ్ కోసం వచ్చి.. డాక్టర్‌ను కాల్చి చంపారు




**న్యూఢిల్లీ-నవభూమి:** హాస్పిటల్లలో తమ భద్రతకు భరోసా నివ్వాలంటూ దేశవ్యాప్తంగా వైద్యులు ఆందోళనలు నిర్వహిస్తున్న వేళ.. మరో డాక్టర్ హత్యకు గురయ్యాడు. వైద్యం కోసం ఇద్దరు యువకులు డాక్టర్‌ను తుపాకీతో కాల్చి చంపిన ఘటన దేశ రాజధాని ఢిల్లీలోని జైత్‌పూర్‌లో గత రాత్రి జరిగింది. బుధవారం రాత్రి కాలి గాయానికి డ్రెస్సింగ్ కోసం ఇద్దరు టీనేజర్లు జైత్‌పూర్‌లోని నిమా హాస్పిటల్‌కు వచ్చారు. వారు అంతకు ముందు రోజు కూడా చికిత్స చేయించుకుని వెళ్లారు. అదేవిధంగా బుధవారం రాత్రి పొద్దు పోయిన తర్వాత కూడా దవాఖానకు వచ్చారు. నర్సింగ్ స్టాఫ్ వారికి డ్రెస్సింగ్ పూర్తిచేశారు. అనంతరం తాము ప్రిస్క్రిప్షన్ రాయించుకుంటామంటూ డాక్టర్ క్యాబిన్‌కు వెళ్లారు. కొద్ది సేపట్లోనే కాల్పుల శబ్దం వినిపించడంతో నర్సింగ్ సిబ్బంది గజాలా పర్వీన్, ఎండీ కమిల్ క్యాబిన్‌కు వెళ్లిచూశారు. అప్పటికే తీవ్రంగా గాయపడి చనిపోవడంతో.. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, నిందితులు 16, 17 ఏండ్ల వయస్సులోపు ఉంటారని పోలీసులకు తెలిపారు. అయితే రెక్కీ నిర్వహించేందుకే ముందు రోజు వారు దవాఖాను వచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

## వజ్రాలు పొదిగిన కిరీటం కనకదుర్గమ్మకు గిఫ్ట్..



**విజయవాడ:-నవభూమి:** విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మకు ఓ భక్తుడు భారీ కానుక సమర్పించారు. వజ్రాలు పొదిగిన కిరీటాన్ని కానుకగా అందజేశారు. మహారాష్ట్రకు చెందిన ఆ భక్తుడు ఈ గిఫ్ట్ ఇచ్చారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి, అర్చకులు ఆ కిరీటాన్ని ప్రజల ముందు ప్రదర్శించారు.

## మణిపూర్‌లో ఇద్దరు బందీల విడుదల.. తొలిసారి హత్తుకున్న మైతీ, కుకీలు



**న్యూఢిల్లీ-నవభూమి:** జాతుల మధ్య ఘర్షణలతో రగులుతున్న మణిపూర్‌లో అరుదైన సంఘటన జరిగింది. పొరపాటున కుకీ ప్రాంతంలోకి ప్రవేశించిన మైతీ యవకులను ప్రాణాలతో విడిచిపెట్టారు. ఈ నేపథ్యంలో ఘర్షణలు మొదలైన తర్వాత తొలిసారి మైతీ, కుకీ సభ్యులు ఒకరినొకరు హత్తు కున్నారు. సెప్టెంబర్ 27న మైతీ వర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మరో మైతీ వ్యక్తితో కలిసి జనరల్ డ్యూటీ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ పరీక్షకు హాజరయ్యేందుకు అస్సాం రైఫిల్స్ క్యాంప్‌నకు బయలుదేరారు. అయితే గూగుల్ మ్యాప్స్‌పై ఆధారపడిన వారు పొరపాటున కాంగ్‌పోక్పిలోని కుకీ ఆధిపత్య గ్రామంలోకి ప్రవేశించారు. ఈ నేపథ్యంలో కుకీ గ్రామ వలంటీర్లు వారిని నిర్బంధించారు. ఒక వ్యక్తిని తర్వాత విడుదల చేశారు.

కాగా, ఇద్దరు మైతీ వ్యక్తుల నిర్బంధం గురించి సీఎం బీరెన్ సింగ్ దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో వారి విడుదల కోసం అన్ని ప్రయత్నాలు చేశారు. కాంగ్‌పోక్పి జిల్లాలోని కుకీ సివిల్ సొసైటీ గ్రూప్ కమిటీల గిరిజన ఐక్యత సంఘం (సీవోటీయూ) మధ్యవర్తిత్వం వహించింది. ఇరు వర్గాలతో చర్చలు జరిపింది. ఇంఫాల్ జైలులో ఉన్న కుకీ-జో ఖైదీలందరినీ వారి ఆధిపత్య ప్రాంతమైన చురచంద్‌పూర్‌కు తరలించాలని, కాంగ్‌పోక్పి జిల్లాలోని ఫైలెంగ్‌మోంగ్‌లో కొత్త పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాలని ఇద్దరు మైతీలను నిర్బంధించిన కుకీ గ్రామ వలంటీర్లు డిమాండ్ చేశారు. మరోవైపు ప్రభుత్వంతో చర్చల తర్వాత ఇంఫాల్ జైలులో ఉన్న కుకీ, జో వర్గాలకు చెందిన 11 మందిని సపర్మీనాలోని జైలుకు తరలించారు. అలాగే ఫైలెంగ్‌మాంగ్‌లో పోలీస్ స్టేషన్‌ను రెండు, మూడు రోజుల్లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ నేపథ్యంలో నిర్బంధంలో ఉన్న ఇద్దరు మైతీ వ్యక్తులను కుకీ గ్రామ వలంటీర్లు విడుదల చేశారు. కాగా, విడుదల చేసిన ఇద్దరు మైతీ వ్యక్తులను కుకీ సివిల్ సొసైటీ గ్రూప్ గురువారం పోలీసులకు అప్పగించింది. ఈ సందర్భంగా ఈ రెండు జాతుల మధ్య ఘర్షణలు మొదలైన 17 నెలల తర్వాత మైతీ, కుకీ సభ్యులు తొలిసారి ఒకరినొకరు హత్తుకున్నారు. మైతీ యువకులు సురక్షితంగా తిరిగి వచ్చేందుకు కృషి చేసిన కేంద్ర, రాష్ట్ర అధికారులకు సీఎం బీరెన్ సింగ్ ధన్యవాదాలు తెలిపారు.

## సింగపూర్ మాజీ మంత్రి సుబ్రమణియం ఈశ్వరన్‌కు జైలుశిక్ష



**న్యూఢిల్లీ-నవభూమి:** సింగపూర్ ప్రభుత్వంలో సీనియర్ క్యాబినెట్ మంత్రి సుబ్రమణియం ఈశ్వరన్(కు ఓ కేసులో 12 నెలల జైలుశిక్ష పడింది. ప్రభుత్వంలో ఉన్న సమయంలో గిఫ్ట్‌లు స్వీకరించినట్లు 62 ఏళ్ల ఈశ్వరన్ కోర్టులో అంగీకరించారు. సుమారు 4 లక్షల డాలర్ల విలువైన బహుమతుల్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫార్ములా వన్ గ్రాండ్ ప్రి, బ్రాంప్టన్ టీలైన్ బైస్కిల్, మద్యం, ప్రైవేటు విమానంలో ప్రయాణం లాంటి గిఫ్ట్‌ను స్వీకరించినట్లు నిర్ధారించారు. సింగపూర్ హైకోర్టులో జస్టిస్ విన్సెంట్ హూంగ్ ఈ కేసులో తీర్పునిచ్చారు. రవాణాశాఖ మాజీ మంత్రిగా చేసిన సుబ్రమణియం.. అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్టోబర్ 7వ తేదీన మంత్రి ఈశ్వరన్ జైలులో లొంగిపోనున్నారు. గత 50 ఏళ్లలో జైలుశిక్ష పడిన రాజకీయవేత్తగా మంత్రి ఈశ్వరన్ నిలిచారు.

## ఎస్‌బీఐ నకిలీ బ్రాంచ్ తెరిచి.. లక్షల్లో మోసం



**రాయ్‌పూర్: -నవభూమి:** మరో కొత్త తరహా మోసం వెలుగులోకి వచ్చింది. ఏకంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) పేరుతో నకిలీ బ్రాంచ్‌ను తెరిచారు. కొందరు వ్యక్తుల నుంచి డబ్బులు వసూలు చేసి ఉద్యోగులుగా నియమించారు. ఆ బ్రాంచ్‌లో బ్యాంకు కార్యకలాపాలు కూడా ప్రారంభించారు. గ్రామస్తుల నుంచి డబ్బులు జమ చేసుకున్నారు. సమీపంలోని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌కు సమాచారం అందడంతో ఈ మోసం బయటపడింది. ఛత్తీస్‌గఢ్‌లోని శక్తి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కొందరు వ్యక్తులు భారీ బ్యాంకింగ్ మోసాన్ని పక్కాగా ప్లాన్ చేసి అమలు చేశారు. మారుమూల ప్రాంతమైన ఛపోరా గ్రామంలో ఏకంగా ఎస్‌బీఐ పేరుతో నకిలీ బ్రాంచ్‌ను తెరిచారు. కాంప్లెక్స్‌లోని షాపును అద్దెకు తీసుకున్నారు. నిజమైన బ్యాంకుగా నమ్మించేందుకు ఫర్నీచర్‌తోపాటు క్యాష్ కౌంటర్ వంటివి ఏర్పాటు చేశారు.


కాగా, బ్యాంకు ఉద్యోగాల పేరుతో రెండు నుంచి ఆరు లక్షల వరకు మహిళలతో సహా ఆరుగురు వ్యక్తుల నుంచి డబ్బులు దండుకున్నారు. వారికి నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్స్ ఇవ్వడంతోపాటు శిక్షణ కూడా ఇచ్చారు. బయోమెట్రిక్ హాజరుతో వారు బ్యాంకు విధులకు హాజరయ్యారు. ఎస్‌బీఐ కొత్త బ్రాంచ్ ఏర్పాటు పట్ల గ్రామస్తులు కూడా సంతోషం వ్యక్తం చేశారు. లావాదేవీల కోసం ఆ బ్రాంచ్‌కు వెళ్లారు. అయితే సుమారు పది రోజుల పాటు పని చేసిన ఎస్‌బీఐ నకిలీ బ్రాంచ్ గురించి సమీపంలోని దబ్రా బ్రాంచ్ మేనేజర్ దృష్టికి వచ్చింది. ఈ బ్రాంచ్ పట్ల ఆయన అనుమానం వ్యక్తం చేశారు. దీంతో సెప్టెంబర్ 27న ఎస్‌బీఐ అధికారులు, పోలీసులు కలిసి అక్కడకు వెళ్లారు. అచ్చం ఎస్‌బీఐ బ్రాంచ్ మాదిరిగా కనిపించడంతోపాటు బ్యాంకింగ్ సేవలు నిర్వహిస్తున్న నకిలీ బ్రాంచ్‌ను చూసి వారు కంగుతిన్నారు. మరోవైపు నకిలీ బ్రాంచ్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు నకిలీ నియామక పత్రాలు ఇచ్చినట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఈ నకిలీ బ్రాంచ్‌కు మేనేజర్‌గా వ్యవహరించిన పంకజ్‌తోపాటు రేఖా సాహు, మందిర్ దాస్‌తో సహా నలుగురు ఈ స్కామ్‌కు పాల్పడినట్లు గుర్తించారు. ఈ మోసంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామస్తులు డబ్బులు పోగొట్టుకోగా, నిజంగా బ్యాంకు ఉద్యోగమని నమ్మి నియామక పత్రాలు పొందిన వారు కూడా చిక్కుల్లో పడ్డారు.

## రైతు బిడ్డల్ని ఫస్ట్ రేట్ అమ్మాయిలు మనువాడరు.. ఎమ్మెల్యే దేవేంద్ర వివాదాస్పద వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ-నవభూమి:** వ్యవసాయం చేసే యువకులను అందమైన అమ్మాయిలు పెండ్లి చేసుకోవడం లేదని మహారాష్ట్ర ఎమ్మెల్యే దేవేంద్ర భూయర్ చేసిన వ్యాఖ్యలు వివాదం రేపాయి. మహారాష్ట్రలోని అమరావతి జిల్లా, వరుద్ తహశీల్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఓ అమ్మాయి అందంగా ఉంటే, ఆమె పెండ్లి చేసుకోవడానికి నీలాంటి, నాలాంటివాళ్లని ఇష్టపడటం లేదు. ఆమె ఉద్యోగస్థుడినే ఎంచుకుంటున్నది. నంబర్ 2లో, ఓ మోస్తరు అందంగా ఉండే అమ్మాయిలు కిరాణా దుకాణం, పాన్ కొట్టు నడిపే యువకులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అందంలో తక్కువ స్థాయిలో ఉన్న అమ్మాయిలు రైతుల కుమారులను చేసుకుంటున్నారు' అని అన్నారు. అలాంటివారికి అందగాళ్లు పుట్టడం లేదన్నారు. దేవేంద్ర భూయర్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. ఆయన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌కు మద్దతిస్తున్నారు. దేవేంద్ర వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత యశోమతి ఠాకూర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఈషా ఫౌండేషన్‌పై పోలీసుల యాక్షన్‌కు బ్రేక్.. సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు సుప్రీంలో ఊరట



**న్యూఢిల్లీ-నవభూమి:** సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు చెందిన ఈషా ఫౌండేషన్‌పై పోలీసుల చర్యలకు బ్రేక్ వేస్తూ ఇవాళ సుప్రీంకోర్టు( ఆదేశాలు ఇచ్చింది. ఈషా ఫౌండేషన్‌తో లింకున్న అన్ని క్రిమినల్ కేసుల వివరాలను వెల్లడించాలని మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో తమిళనాడు పోలీసులు చర్యలకు దిగారు. ఈ నేపథ్యంలో ఈషా ఫౌండేషన్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మద్రాసు హైకోర్టు ఆదేశాలపై సుప్రీం స్టే ఇచ్చింది. కోయంబత్తూరులోని ఈషా ఫౌండేషన్ ఆశ్రమంలో ఉన్న తన ఇద్దరు కూతుళ్లకు బ్రెయిన్‌వాష్ చేశారని, దాంతో వాళ్లు ఇంటికి రావడం లేదని ఓ తండ్రి దాఖలు చేసిన పిటీషన్ ఆధారంగా హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పర్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఇవాళ ఈ కేసులో వాదనలు విన్నది. ఆ ఇద్దరు మహిళలతో ధర్మాసనం మాట్లాడింది. తమ ఇష్టపూర్వకంగానే ఆశ్రమంలో ఉంటున్నట్లు ఆ ఇద్దరు మహిళలు వెల్లడించారు. తమను ఎవరూ నిర్బంధించడంలేదని పేర్కొన్నారు. ఈషా ఫౌండేషన్‌పై నమోదు అయిన కేసును మద్రాసు హైకోర్టు నుంచి సుప్రీంకోర్టుకు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. తమిళనాడు పోలీసులు ఇచ్చే స్టేటస్ రిపోర్టును సుప్రీంకు సమర్పించాలని ఆదేశించారు.

## హెచ్‌సీఏలో 20 కోట్ల ఫ్రాడ్.. అజారుద్దీన్‌కు ఈడీ సమన్లు




**హైదరాబాద్:-నవభూమి:** హైదరాబాద్ క్రికెట్ సంఘంతో లింకున్న మనీల్యాండరింగ్ కేసులో.. మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు ఇవాళ ఈడీ నోటీసులు జారీ చేసింది. 2020 నుంచి 2023 వరకు హెచ్‌సీఏలో జరిగిన అక్రమాలపై ఉప్పల్ పోలీస్ స్టేషన్లో పలు ఫిర్యాదులు ఉన్నాయి. ఆ సమయంలో హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అజార్ పనిచేశారు. క్రికెట్ బాల్స్, బకెట్ చైర్స్, జిమ్ పరికరాలకు కొనుగోళ్లలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉప్పల్లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈసీఆర్ నమోదు చేసింది ఈడీ. ఈ విషయం ఇప్పటికే అజారుద్దీన్ బెయిల్ పొందారు. అయితే తాజాగా విచారణ చేపట్టాలని ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసింది. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, మాజీ ఎంపీ, ప్రస్తుత తెలంగాణ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన అజారుద్దీన్.. గురువారం ఈడీ ముందు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు. హెచ్‌సీఏలో 20 కోట్ల మోసం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసులో ఈడీ విచారణ చేపడుతున్నది. ఇదే కేసులో మాజీ క్రికెటర్లు అర్షద్ అయూబ్, శివలాల్ యాదవ్‌లను గత డిసెంబర్‌లో విచారించారు. హెచ్‌సీఏ కేసులో మాజీ మంత్రి, హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు జీ వినోద్‌ను కూడా ఈడీ ప్రశ్నించింది. గత ఏడాది నవంబర్‌లో వినోద్, శివలాల్ యాదవ్, అర్షద్ అయూబ్ ఇండ్లల్లో ఈడీ సోదాలు కూడా చేపట్టింది. మనీల్యాండరింగ్ చట్టం కింద 9 ప్రదేశాల్లో తనిఖీలు జరిగాయి. ఏసీబీ నమోదు చేసిన మూడు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ విచారణ మొదలుపెట్టింది. ఉప్పల్ స్టేడియం కోసం డీజీ సెట్లు, ఫైర్‌ఫైటింగ్ సిస్టమ్స్, కెనోపీల ఖరీదులో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది అక్టోబర్‌లో అజారుద్దీన్‌పై నాలుగు క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయి. సుమారు 3.85 కోట్ల నిధుల్ని దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉప్పల్ పోలీసు స్టేషన్‌లో ఆ కేసులు బుక్ చేశారు. చీటింగ్, ఫోర్జరీ, నేరపూరిత కుట్ర కింద అజార్‌పై కేసులు పెట్టారు. హెచ్‌సీఏకు చెందిన నాలుగు కేసుల్లోనూ గతంలో సిటీ కోర్టు అజార్‌కు బెయిల్ మంజూరీ చేసింది. 2019లో హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అజార్ ఎన్నికయ్యారు. ఆయన 2023 ఫిబ్రవరి వరకు ఆ బాధ్యతలు నిర్వర్తించారు.

## దేశానికి జాతిపితలు ఎవరూ లేరు.. మరోసారి నోరుపారేసుకున్న కంగనా రనౌత్



**న్యూఢిల్లీ-నవభూమి:** బీజేపీ ఎంపీ, బాలీవుడ్ నటి కంగనా రనౌత్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మహాత్మ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీల జయంతి సందర్భంగా ఆమె సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. 'దేశానికి జాతిపితలు ఎవరూ లేరు. కేవలం కుమారులు మాత్రమే ఉన్నారు. భారతమాతకు ఇలాంటి కుమారులు(లాల్ బహదూర్ శాస్త్రి) ఉండటం అదృష్టం' అని ఆమె వ్యాఖ్యానించారు. మహాత్మ గాంధీని ఉద్దేశపూర్వకంగా కంగనా రనౌత్ తక్కువ చేశారని కాంగ్రెస్ ఆరోపించింది.

## మాజీ మంత్రి మర్డర్ కేసులో.. మాజీ ఎమ్మెల్యేకు జీవితకాల జైలుశిక్ష



**న్యూఢిల్లీ-నవభూమి:** బీహార్ మాజీ మంత్రి బ్రిజ్ బిహారీ ప్రసాద్ హత్య కేసులో.. మాజీ ఎమ్మెల్యే మున్నా శుక్లాకు ఇవాళ సుప్రీంకోర్టు జీవితకాల జైలుశిక్ష(విధించింది. 1998లో జరిగిన మర్డర్ కేసులో మాజీ ఎమ్మెల్యేతో పాటు మరో వ్యక్తికి కూడా జీవితఖైదు విధించారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా, సంజయ్ కుమార్, ఆర్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసులో ఇవాళ తీర్పును ఇచ్చింది. మాజీ మంత్రి హత్య కేసులో దోషుల్ని రిలీజ్ చేస్తూ ఇచ్చిన పాట్నా హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు పక్కనపెట్టింది. నిందితులు మంటు తివారీ, మాజీ ఎమ్మెల్యే శుక్లా.. 15 రోజుల్లోగా లొంగిపోవాలని కోర్టు ఆదేశించింది. మాజీ ఎంపీ సూరజ్‌భాన్ సింగ్‌తో పాటు మరో ఆరుగుర్ని ఈ కేసులో బెనిఫిట్ ఆఫ్ డౌట్ కింద నిర్దోషులుగా ప్రకటించారు. 302(మర్డర్), 307(హత్యాయత్నం) కేసుల కింద తివారీ, శుక్లాపై అభియోగాలు రుజువు అయినట్లు కోర్టు చెప్పింది.

## భారతీయుల హెచ్-1బీ వీసాలు గడ్డు పరిస్థితుల్లో ఉన్నాయా?




**న్యూఢిల్లీ-నవభూమి:** యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో టెక్ పరిశ్రమ గణనీయమైన తొలగింపులను ఎదుర్కొంటోంది. దీంతో... ఇది హెచ్-1బీ వీసాలపై ఉన్న భారతీయ కార్మికులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇదే సమయంలో... కఠినమైన వీసా నిబంధనలు, పెరుగుతున్న దరఖాస్తు రుసుములు వీరి ఇబ్బందులను మరింత పెంచుతున్నాయని అంటున్నారు. లేఆఫ్.ఎఫ్ఐ నివేదిక ప్రకారం... 438కి పైగా టెక్ కంపెనీలు సుమరు 1,37,500 మంది ఉద్యోగులను తొలగించాయి. దీంతో... హెచ్-1బీ వీసాలపై ఉన్న భారతీయ ఉద్యోగులు కొత్త ఉపాధిని త్వరగా కనుగొనడం.. లేదా, బహిష్కరణను ఎదుర్కోవాల్సిన కఠినమైన సమయం కారణంగా తీవ్ర సమస్యను ఎదుర్కొంటున్నారని అంటున్నారు. యూఎస్ కాంగ్రేషనల్ రీసెర్చ్ సర్వీస్ నివేదికల ప్రకారం... ఇప్పటికే చాలా మంది భారతీయ ఉద్యోగులు గ్రీన్ కార్డుల కోసం దశాబ్దాలుగా బ్యాక్ లాగ్ లను ఎదుర్కొంటున్నారని.. మరికొంతమంది శాస్వత నివాసం కోసం ఏకంగా 190ఏళ్లుగా వేచి ఉన్నారని.. ఈ సుదీర్ఘ అనిశ్చితి వారి పరిస్థితిని మరింత సమస్యాత్మకంగా మారుస్తోందని చెబుతున్నారు. అయితే... యూఎస్ వీసా విధానాలలో ఇటీవల చోటు చేసుకున్న పలు మార్పులు ఈ సవాళ్లను తీవ్రతరం చేస్తున్నాయనే చెప్పాలి. ఇందులో భాగంగా... హెచ్-1బీ వీసాల కోసం దరఖాస్తు రుసుము ఒక్కొక్కరినీ $10 నుంచి $215కి పెరిగింది. అంటే... ఈ పెరుగుదల 2150శాతం అన్నమాట. ఇదే సమయంలో పేపర్ ఫైలింగ్ ఫీజు కూడా 460 నుంచి $780కి పెరిగింది. అంటే.. ఇక్కడ పెరుగుదల 70%గా ఉంది. ఇలా కఠినతరమైన ఇమ్మిగ్రేషన్ ల్యాండ్ స్కేప్ లో.. తొలగింపులు, దీర్ఘకాల గ్రీన్ కార్డ్ వెయిటింగ్ లు, పెరిగిన వీసా ఫీజుల కారణంగా భారతీయ ఉద్యోగులు యూఎస్ లో స్థిరమైన ఉపాధి, రెసిడెన్సీని పొందేందుకు కష్టపడుతున్నరని అంటున్నారు.

## ఈషా ఫౌండేషన్‌ను ప్రశ్నించిన మద్రాస్ హైకోర్టు



**చెన్నై-నవభూమి:** సద్గురు జగ్గీ వాసుదేవ్ ఓ వైపు తన కుమార్తెకు పెండ్లి చేసి జీవితంలో స్థిరపడేట్లు చేసి, మరోవైపు ఇతర యువతులను సన్యాసినులుగా బతికేలా ఎందుకు ప్రోత్సహిస్తున్నారని మద్రాస్ హైకోర్టు ప్రశ్నించింది. తన ఇద్దరు కుమార్తెలు బాగా చదువుకున్నారని, వారు పెండ్లి చేసుకోకుండా ఈషా యోగా సెంటర్ బ్రెయిన్ వాష్ చేస్తున్నదని రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్ కామరాజ్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరుపుతున్నది. అయితే, 42, 39 సంవత్సరాల వయసుగల ఈ ఇద్దరు మహిళలు సోమవారం హైకోర్టుకు హాజరై, తాము తమ ఇష్ట ప్రకారమే, స్వీయ నిర్ణయంతోనే ఈషా యోగా సెంటర్‌లో ఉంటున్నామని చెప్పారు. ఈషా ఫౌండేషన్‌కు సంబంధించిన అన్ని కేసుల జాబితాను తయారు చేసి, నివేదికను సమర్పించాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. దీంతో దాదాపు 150 మంది పోలీసులు మంగళవారం ఈషా ఫౌండేషన్‌లో తనిఖీలు చేశారు. కాగా పెండ్లి చేసుకోవాలని కానీ, బ్రహ్మచర్యం చేపట్టాలని కానీ తాము చెప్పబోమని ఈషా ఫౌండేషన్ వివరణ ఇచ్చింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4
హైదరాబాద్
శుక్రవారం
04 । అక్టోబర్ । 2024



## రోజుకో పూట ఉపవాసంతో మధుమేహ నియంత్రించొచ్చు!

**న్యూఢిల్లీ-నవభూమి:** మధుమేహ వ్యాధిగ్రస్తులైనా, హృద్రోగులైనా సరే.. రోజుకు ఒక పూట ఉపవాసం చేస్తే మధుమేహం నియంత్రణలో ఉండటంతో పాటు గుండె ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తాజా అధ్యయనం తెలిపింది. ప్రతి 10 గంటలకు ఒకసారి తింటే.. జీవక్రియ మెరుగుపడుతుందని తేలింది. రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో



ఉంటాయని, కొలెస్ట్రాల్ తగ్గుతుందని అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్‌డియాగో, సాల్క్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడైంది. మెటబాలిక్ సిండ్రోమ్‌తో బాధపడుతున్న 108 మందిని పరీక్షించగా మెరుగైన ఫలితాలు వచ్చినట్టు పరిశోధకులు తెలిపారు.



## అరచేతిలో... ఆరోగ్యం?!

ఒకరకంగా ఇది విప్లవాత్మక ఆలోచన. అసంఖ్యాక ప్రజానీకానికి అవసరమైన ఆరోగ్యదాయక ఆలోచన. పేద, మధ్యతరగతి వర్గాలకు వైద్యచికిత్సనూ, ఆరోగ్య సంరక్షణనూ అందుబాటులోకి తేవడా నికి సంపూర్ణంగా సాయపడితే... స్వాగతించదగ్గ ఆలోచన. దేశంలో ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ గుర్తింపు కార్డు ఇచ్చే భారీ దేశవ్యాప్త ప్రయత్నానికి మోదీ సర్కారు సోమవారం శ్రీకారం చుట్టింది. గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవంలో ఎర్రకోట సాక్షిగా ప్రధాని ప్రకటించిన 'ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్'లో ఇది భాగం. అప్పటి నుంచి 6 కేంద్ర పాలిత ప్రాంతాల్లోనే ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఈ బృహత్ కార్యక్రమం ఇప్పుడిక దేశవ్యాప్తం కానుంది. అంటే, ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ కార్డుల జాబితాలో మరో దేశవ్యాప్త గుర్తింపు కార్డు చేరనుంది. సంక్షేమం కోసమే అయినప్పటికీ, ప్రజలందరి సమాచారాన్నీ సర్కారు సేకరించి, డిజిటల్ మ్యాపింగ్ చేసేందుకు కొత్త వీలు చిక్కింది. సమగ్ర డిజిటల్ ఆరోగ్యవ్యవస్థలో వ్యక్తులకు ఆరోగ్య ఐడీ కార్డులతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న వైద్యుల జాబితా, అలాగే ఆరోగ్య వసతుల జాబితా కూడా సిద్ధం చేయాలన్నది కేంద్ర ఆలోచన. ఈ కొత్త ఆరోగ్య గుర్తింపు కార్డు కింద ఆయా వ్యక్తుల ఆరోగ్య రికార్డులన్నీ డిజిటల్‌గా అందుబాటులో ఉంటాయి. జన్‌ధన్ ఖాతా, ఆధార్, మొబైల్ ఫోన్ (సంక్షిప్తంగా జామ్) – ఈ మూడింటి అనుసంధానం, అలాగే సర్కారీ ఇతర డిజిటల్ ప్రయత్నాల వల్ల ఈ 'జాతీయ డిజిటల్ ఆరోగ్య మిషన్' (ఎన్డీహెచ్ఎం)కు పునాదిగా ఆన్‌లైన్ వేదిక ఇట్టే దొరుకుతుందని సర్కారు భావిస్తోంది. నగదు చెల్లింపుల్లో విప్లవం తెచ్చిన 'యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేజ్' (యూపీఐ) లానే, ఇక్కడ 'యూనిఫైడ్ హెల్త్ ఇంటర్‌ఫేజ్' (యూహెచ్ఐ) వాడతారట. డాక్టర్లు, ఆస్పత్రులు, ల్యాబ్‌లు, మందుల దుకాణాలు రోగుల గత రిపోర్ట్‌లను డిజిటల్‌గా నమోదు చేస్తాయి. దాంతో, రోగి ఐడీ కార్డుతో ఆ వ్యక్తి ఆరోగ్య సమాచారాన్ని దేశంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఇచ్చిపుచ్చుకోవచ్చు. ఆ వ్యక్తి ఆరోగ్య చరిత్ర, తీసుకున్న చికిత్స, అందుబాటులో ఉన్న సేవలు దేశవ్యాప్తంగా చిటికెలో తెలుస్తాయి. అందుకే, ఆరోగ్యరంగంలో ఉన్నవారందరికీ పని సులువయ్యే ఈ విధానం ఓ సరికొత్త విప్లవం. ప్రతి పౌరుడికీ 14 అంకెల డిజిటల్ ఆరోగ్య ఐడీ నంబర్ ఇస్తారు. అదే ఆ వ్యక్తి ఆరోగ్య ఖాతా నంబర్. ఈ ఆరోగ్య ఖాతాలో డిజిటల్‌గా అతని ఆరోగ్య చరిత్రంతా నమోదై ఉంటుంది. పాత రికార్డుల మోతబరువు తగ్గుతుంది. రోగి కొత్త ప్రాంతానికి, కొత్త డాక్టర్ వద్దకు వెళ్ళినా సరే సమా చారమంతా డిజిటల్‌గా మీట నొక్కితే అందుబాటులో ఉంటుంది. ఇలా ఈ డిజిటల్ హెల్త్ మిషన్‌లో సేకరించే వ్యక్తిగత ఆరోగ్య సమాచారాన్ని గోప్యంగా, భద్రంగా ఉంచుతామని ప్రభుత్వ హామీ. ఆరోగ్యరంగంలో సాంకేతికవినియోగం ఇటీవల విస్తృతమైంది. కరోనా వేళ టెలీ మెడిసిన్ వసతి విస్తరించింది. 'ఇ-సంజీవని'తో 125 కోట్ల రిమోట్ కన్సల్టేషన్లు జరిగాయని కేంద్రం లెక్క. వాటిలో ఏపీదే అగ్రస్థానం. ఇక, 'ఆరోగ్యసేతు' యాప్ లాంటివి కోవిడ్‌కు అడ్డుకట్టలో సహకరించడమూ తెలిసిందే. ఇప్పుడీ డిజిటల్ హెల్త్‌కార్డ్ మరో ముందంజ. నిజానికి, ఇది మరీ కొత్తదేమీ కాదు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత జగన్మోహనరెడ్డి సర్కారు ఈ పని చాలాకాలంగా చేస్తోంది. 'ఆరోగ్యశ్రీ' పథకంతో లబ్ధి పొందుతున్న దాదాపు కోటిన్నర కుటుంబాలకు ఏపీ ప్రభుత్వం ఇప్పటికే క్యూఆర్ కోడ్ ఉన్న కార్డులిచ్చింది. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరేసి డాక్టర్లను పెట్టింది. రాష్ట్రంలో మొబైల్ మెడికల్‌యూనిట్ '104' సర్వీసుతో 700 దాకా వాహనాలు రోజూ కనీసం ఓ గ్రామానికెళ్ళి, అక్కడి ప్రజల ఆరోగ్యస్థితులు విచారించి, ఆ సమాచారం రికార్డు చేసే బృహత్ యజ్ఞం చేపట్టింది. ఏపీలో ఆరోగ్యశ్రీ కార్డున్నవారు ఇప్పటికే రాష్ట్రంలో ఏ ప్రభుత్వ, నెట్వర్క్ ఆసుపత్రికి వెళ్ళినా వారి ఆరోగ్యచరిత్ర మొత్తం వైద్యులకు అందుబాటులో ఉంటోంది. తాజా కేంద్ర ప్రయత్నంతో డేటా దేశమంతటా ఎక్కడైనా అందుబాటులోకి వస్తుందన్న మాట. వ్యక్తుల సమాచారం, మొబైల్ ఫోన్, ఆధార్ నంబర్ లాంటి వివరాల ఆధారంగా ఉచితంగా ఈ కొత్త హెల్త్ ఐడీ కార్డ్ సృష్టి జరగనుంది. ఆరోగ్య నిపుణుల చిట్టా (హెచ్‌పీఆర్), ఆరోగ్య వసతుల చిట్టాల (హెచ్ఎఫ్ఆర్) లాంటి యాప్‌లు పెడతారు. ఇలా దేశపౌరులందరి ఆరోగ్య సమాచారాన్ని సేకరించి, విశ్లేషించడం వల్ల రాష్ట్రాలలో ఆరోగ్య పథకాలను మెరుగ్గా ప్లాన్ చేయవచ్చు. దేనికి తగినట్టు దానికి నిధులు కేటాయించవచ్చు. వృథా ఖర్చు అరికట్టవచ్చునేది ప్రభుత్వ వాదన. అరచేతిలో ఆరోగ్యం లాంటి ఈ మాటలు వినడానికి బాగున్నాయి. కానీ, డిజిటల్ అక్షరాస్యత మాట దేవుడెరుగు, మామూలు అక్షరాస్యతే అందరికీ లేని దేశం మనది. పాశ్చాత్య ప్రపంచానికి భిన్నంగా ఆర్థికంగానే కాదు అంతర్జాల వసతుల్లోనూ భారీ అంతరాలున్న చోట ఈ భగీరథ యత్నం ఏ మేరకు, ఎప్పటికి ఆచరణ సాధ్యమో! దేశంలోని 135 కోట్ల మందికీ హెల్త్ కార్డులంటే సంకల్పశుద్ధి అవసరం. ప్రతి ఒక్కరికీ ప్రత్యేక గుర్తింపుకార్డన్న దశాబ్దకాల ఆధార్ ఆలోచనే నేటికీ సంపూర్ణ సాకారం కాలేదు. ఆధార్ నమోదులో, డేటా అక్రమ వాడకంలో ఎన్నో స్కామ్‌లు బయటపడ్డాయి. ఈ కొత్త కార్డుకైనా ఆ లోపాలు లేకుండా చూడాలి. అది సర్కార్‌కు సవాలే. అన్నిటికీ మించి ఎప్పటికప్పుడు వ్యక్తుల ఆరోగ్య రికార్డులను అప్‌డేట్ చేసే సత్తా మన ఆస్పత్రులకు ఏ మేరకు ఉంది? చిత్తశుద్ధితో, లోపరహితంగా ఎప్పటికప్పుడు ఆ పని చేయించడం కష్టసాధ్యం. ఆ కష్టాలెలా ఉన్నా, ఈ కార్డులతో పాటు ప్రాథమిక ఆరోగ్య వసతులు, రోగులు- వైద్యులు – పడకల నిష్పత్తిపై కేంద్ర సర్కారు వారి దృష్టి పడితే మహద్భాగ్యం.

# రాజకీయాలలో వ్యక్తిగత ఆరోపణలు ఆక్షేపనీయం




రాజకీయంలో ఉండే మహిళలపైనే కాదు, సాధారణ మహిళలపై ట్రోలింగ్ చేయడం తప్పే. వాస్తవంగా ట్విట్టర్( ఎక్స్)లో ఇటువంటి పోస్టులు ఎవరు పెట్టారో వారిమీద చర్యలు తీసుకోవాలి. వారు సామన్యులైనా, రాజకీయ పార్టీలకు చెందిన వారైనా సరే వదలకూడదు. అంతే తప్ప ఒకరిపై ఒకరు వ్యక్తిగత ఆరోపణలు చేసుకోగూడదు. మంత్రి సురేఖపై ఎక్స్ లో ట్రోలింగ్ చేస్తూ పెట్టిన పోస్ట్ ముమ్మాటికీ తప్పే ! అందరూ రాజకీయాలకు అతీతంగా ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒక రాజకీయ పార్టీలలో ఉండే వారిని ప్రజలందరూ గమనిస్తారు. వారు ఎంతో హుందాగా మాట్లాడాలి. రాను రాను రాజకీయ నాయకుల వారి హెూదాను మరిచి ఆరోపణలు చేసుకుంటున్నారు. ఇది మంచిది కాదు. ఈ పోస్టును కేటిఆర్ పెట్టించారనే మంత్రి సురేఖ గారి ఆరోపణ. " మేము పెట్టించలేదు, మాకు ఆ ట్రోలింగ్ పోస్ట్ కు సంబంధం లేదని" బి.ఆర్.యస్ పార్టీ వాదన. హరీష్ ఈ విధంగా ట్రోలింగ్ చేయడాన్ని ఖండించడం మంచిదే. అదే సమయంలో కేటీఆర్ గూడ ఖండిస్తే ఈ సమస్య వచ్చేదే కాదు. సరే అంత వరకూ బాగానే ఉంది. మధ్యలో సురేఖ సినిమా హీరోయిన్ సమంత విషయం తేవడం చాలా తప్పు. కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు సినిమా హీరోయిన్ల జీవితాలతో ఆడుకున్నారని, చాలా



మంది హీరోయిన్లు ఇబ్బందిపడ్డారని, అందువలనే కొంత మంది హీరోయిన్లు త్వరగా పెళ్ళిచేసుకున్నారని ఆరోపించడం చాలా తప్పు. సమంత విడాకులకు కేటిఆర్ కారణమని బహిరంగంగా ఒక మంత్రి హెూదాలో ఉండి ఆరోపణలు చేయడం దారుణం. సోషల్ మీడియాలో ఆమెపైన, మంత్రి సీతక్క, మేయర్ విజయలక్ష్మి పైనా పోస్టులు పెట్టడం బాధాకరమని మంత్రి సురేఖ అనడంలో వాస్తవం ఉంది. ఆమె బాధను మనమందరం ఒప్పుకొని తీరాల్సిందే. ట్విట్టర్ లో పోస్ట్ కి ఆవిడ ఎంత బాధ పడుతున్నారో అంతే బాధ సమంతాకు కలగదా! అందులోనూ గతంలో ఆవిడ ప్రముఖ కుటుంబానికి కోడలు. వారి వారి మనసులు గాయపడవా? ఈ ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయా ? సరే ఒకవేళ ఉంటే దర్యాప్తు చేయలే తప్ప బహిరంగంగా ఇలా మాట్లాడడం మంచి సాంప్రదాయం కాదు. వెంటనే దీనిపైన నాగార్జున ఎంతో ఆవేదనతో ఎక్స్ లో " గౌరవనీయ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖ వ్యాఖ్యలని తీవ్రంగా ఖండిస్తున్నాను. రాజకీయాలకు దూరంగా ఉండే సినీ ప్రముఖుల జీవితాలని, మీ ప్రత్యర్థులని విమర్శించేందుకు వాడుకోకండి. దయచేసి సాటి మనుషుల వ్యక్తిగత విషయాలని గౌరవించండి. బాధ్యత గలిగిన పదవి లో ఉన్న మహిళగా మీరు చేసిన వ్యాఖ్యలు, మా కుటుంబం పట్ల మీరు చేసిన ఆరోపణలు పూర్తిగా అసంబద్ధం, అబద్ధం. తక్షణమే మీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవలిసిందిగా కోరుతున్నాను." పోస్ట్ చేసారు. అలాగా సమంత, నాగ చైతన్య , చాలా మంది ఈ విషయాన్ని ఖండిస్తూ ట్వీట్ చేసారు. ప్రతిపక్షం కూడా హుందాగా ఉండాలి. అధికారంలో ఉండే మంత్రిపైన, ముఖ్యమంత్రి గారి మీద నిరాధార ఆరోపణలు చేయగూడదు. ఇష్టానుసారం మాటలాడకూడదు. నాయకులుగా ఉండే వారు కొన్ని ఆదర్శాలను, సంప్రదాయాలను పాటించాలి. చట్టపరంగా సురేఖ మీద ట్రోల్ చేసిన వారిని పట్టుకొని శిక్షించాలి. అటువంటప్పుడే ఇటువంటి సంఘటనలు జరగవు. చివరికి మంత్రి కొండా సురేఖ ఆవిడ మాటలను వెనక్కు తీసుకొని క్షమాపణ కోరడం చాలా అభినందనీయం. ఎవరైనా రాజకీయ నాయకులు ముందు వెనుక చూడకుండా ఆరోపణలు చేయడం ఇకనైనా మానాలి. ఎదుట వారి మనసు కూడా మనలాంటిదనే విషయం గుర్తెరగాలి. సభ్య సమాజం తలదించుకునేలా ఆరోపణలు చేయకూడదు. అధికారం ఉన్నపుడు ఒకలా, లేనప్పుడు ఒకలా ప్రవర్తించగూడదు. ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ కూడా రాష్ట్ర అభివృద్ధికి కావల్సిన సలహాలు ఇవ్వాలి. సామాజిక మాధ్యమాలలో పెట్టిన పోస్టులను ఖండించాలి. అప్పుడే అందరికీ మంచిది. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారనే విషయం మరువగూడదు.

**జనక మోహన రావు దుంగ**
**8247045230**


# ఆధ్యాత్మిక కవి .. సుమనశ్రీ



ప్రముఖ కవి, సాహిత్య విమర్శకుడు సుమనశ్రీ (చెళ్ళపిళ్ళ కామేశ్వం రావు,77) ఇకలేరన్న వార్త మరణించిన 20 రోజుల తర్వాత వెలుగులోకి.. వచ్చింది. సాహిత్య లో కా ని కి భావకవిగా పరిచయమై ఆధ్యాత్మిక కవిగా మిగిలారు.

సుమనశ్రీ స్వస్థలం నరసరావుపేట. అక్కడేడిగ్రీచదివిన తర్వాత అనంతపురం ఇంజనీరింగ్ కళాశాల లో మెకానికల్ ఇంజనీరింగ్ (బీఈ) చదివారు...! అదే సబ్జెక్టుపై ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పీజీ,.. పీహెచ్‌డీ చేశారు. అనంతరం అదే విశ్వవిద్యాలయంలో ఏడేళ్ల అధ్యాపకునిగా సేవలందించారు. హైదరాబాద్, బీహెచ్ఈఎల్‌లో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్‌విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా 2003లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తీసుకొన్నారు. ఆనాటి నుంచి పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రొఫెసర్‌గా 2018 వరకు సేవలందించారు. కెనడాలోని అట్టావా వర్సిటీలోనూ విజిటింగ్ ప్రొఫెసర్‌గా మూడేళ్లు పనిచేశారు. సాహిత్య జీవితానికొస్తే,... సుమనశ్రీ తండ్రి,పద్యకవి బంగారేశ్వరశర్మ ప్రోత్సాహంతో కవిత్వం రాశారు.

1965 లో కవిగా తన సాహితీ ప్రస్థానం ప్రారంభించారు. లిగీతం పునీతమౌతుంది. లిరెప్పలమధ్య ఆకాశంలిరక్త నేత్రోదయంలిమహా స్వప్నం లినేత్రం నా సంకే
తం..వంటి కవితా సంపుటులను వెలువరించారు.
కొన్నికథా సంపుటాలనుకూడా తెచ్చారు.
లిఒక మరణ మృదంగ ధ్యానంలో హాయిగా%ొ.
% ప్రాణాలువిడుస్తున్నాన్నేను. మహదానందం
గా...చాలు ఇక ఈ జీవితానికి ..ఇంతటి విహ్వ
లానుభవం"!!
లిదుఃఖాభిషేకాన్ని కానుకగా అనుభవించడమే
జీవితమని%ొ%అనుభవంలోనే అర్థమవుతుందీ.!!
లిచీకటీ వెలుగూ మనకీ బంధువులే ఎంత అందం
గా ఉంటాయి అవి రెండూ !'
లిఆకాశంలోంచి క్రిందికి చూడ్డం నేర్చుకోనీకు పగ
లూ రాత్రీ అందంగానే కనిపిస్తాయి..
లిజీవిత రహస్యాల్ని ఛేధించడం నా హాబీ
మృత్యు రహస్యాల్ని ఆవిష్కరించడమన్నా
స్వర్గాంతర ద్వారాల్ని తెరుస్తూస్వప్నలోకాల్ని
ఆవిష్కరించడమన్నా నా కత్యంత సరదా'..
(రహస్యాక్షరం)
లినా ఒంటరితనం నా చుట్టూ నేనల్లుకున్న వల.
లిఒకే ఒక్క స్నేహితుని జాబు కోసం యుగయుగా
లుగా నిరీక్షిస్తున్నవాణ్ణి అడక్కుండా మీ ఇంట్లో కొస్తున్న
అతిథినీ.!
లిస్వప్నసముద్రం లోంచీ అనే కవితలో అంటాడు.
'స్వప్నాన్ని ఆరాధిస్తూ స్వప్నాన్ని అధిరోహిస్తూ
నన్ను నేనే ఒక స్వప్నంగా ఈ స్వాప్నిక ప్రపంచం
లో రూపు దిద్దుకుంటూ'..."!
లిమబ్బులతో ఆకాశంలో ఎలా యుద్ధం చేస్తున్నా
డో చంద్రుడుజీవితం మీద వాడికెంత ప్రేమ ఉందో
తెలుసుకోవాలంటేనీ కోసమే ఎదురుచూస్తున్న..
నన్ను చూడు నా చూపులో మెరుస్తూ కదుల్తున్న ఆశల
పల్లకీని చూడూ.(రా ఇలా వచ్చి కూచో)
లిపసిపిల్ల స్వచ్ఛమైన మనసు నా గీతమైతే బాగుం
డును..పసిపిల్ల ఒళ్ళో పడుకుని అమ్మని గురించి
కలలు కంటానూ.."
లికలల్ని కౌగలించుకోలేని నువ్వు జీవితంలో
ఏ సుఖాన్నీ అందుకోలేవు.. (కొవ్వొత్తి సుందరి)
లి'ఆడవాళ్ళకంతా తెలుసు,
అందుకే నిమ్మళంగా
కూర్చుంటారూ%ొ%మగవాళ్ళం
మనమే తొందర
పడిపోతుంటాం'/చెదిరిపోతున్న
మనసులతో కరిగిపోతున్న
మనుషుల్ని చూస్తూ లోలోపలే
పకపకా నవ్వుకుంటూ
వుంటారు.."!!
ఇలా లోతైన భావాలతో కవిత్వం
రాశారు సుమనశ్రీ..ఓ కవి మరణ వార్త ఇంత
ఆలస్యంగా లోకానికి తెలియడం ఆశ్చర్యం..!!
విశాఖ అక్కయ్యపాలెం
శ్మశానవాటికలో సెప్టెంబరు 15
న సుమనశ్రీ అంత్యక్రియలు





జరిగాయి..వారికి
కన్నీటి నివాళులు..!!

**(చిత్రం..మొహమ్మద్ గౌస్)**
**లిఎ.రజాహుస్సేన్..!!**

# శ్రీగౌరి నీ పూజ ఉయ్యాలో...





విశ్వం అంతా శక్తిమయం. ప్రకృతే పరాశక్తి. ఆ మాత అనేక రూపాల్లో అభివ్యక్తమవుతుంది. దుర్గగా, గౌరిగా... ఇలా ఎన్నో విధాలుగా పూజలందుకుంటుంది. గౌరిగా ఆరాధించే రూపానికి ప్రతిరూపమే బతుకమ్మ.

ఇది తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే వేడుక.

ఆశ్వయుజ మాసం శరద్రుతువులో తొలి మాసం. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి దుర్గా నవరాత్రులు ప్రారంభమవుతాయి. అంతకు ఒక రోజు ముందుగానే... అంటే భాద్రపద అమావాస్య నాటి నుంచే బతుకమ్మ సంబరాలు మొదలవుతాయి. ఇది ప్రకృతిని ఆరాధించడానికి అనువైన మాసం. పరిసరాలన్నీ శోభాయమానంగా ఉంటాయి. చంద్రుడు షోడశ కళలతో చల్లని వెన్నెల కురిపిస్తాడు. రంగురంగుల పూలతో చెట్లు కనువిందు చేస్తాయి. వాటి సువాసనలతో గాలి గుబాళిస్తూ ఉంటుంది. అర్చనలో పూలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఆ పూలనే బతుకమ్మగా ఆరాధించడం విలక్షణమైన సంస్కృతి.

%కైలాసంలో మెట్టినింట ఉన్న గౌరిని (పార్వతిని) మహాలయ అమావాస్యకు ముందుగానే పుట్టినింటికి ఆహ్వానిస్తారు. మహాలయ అమావాస్యనాడు గౌరిని యథావిధిగా అలంకరించినా... ఆ రోజు పితృ అమావాస్య కాబట్టి... పితృదేవతలకు నివేదనలు ప్రధానం కనుక ఆ రోజు ప్రత్యేక పూజలు ఉండవు. వరిపిండిలో నువ్వులు, బెల్లం కలిపిన పదార్థాన్ని బతుకమ్మకు నైవేద్యం పెడతారు. ముందురోజు సేకరించిన పువ్వులతో బతుకమ్మను పేరుస్తారు కాబట్టి... తొలి రోజున గౌరీదేవిని 'ఎంగిలి పూల బతుకమ్మ' అని వ్యవహరిస్తారు. బతుకమ్మ పుట్టు పూర్వోత్తరాల గురించి ఎన్నో కథలు పాటల రూపంలో ఉన్నాయి. పూర్వం ధర్మాంగదుడనే రాజు ఉండేవాడనీ, అతను, అతని భార్య సత్యవతి శివ భక్తులని, ఆ దేవదేవుడి అనుగ్రహంతో జన్మించిన కుమార్తెకు 'బతుకమ్మ' అని పేరు పెట్టుకున్నారనీ ఒక కథ ఉంది. ఈ సంబరాల్లో ప్రతి రోజూ మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను తయారు చేస్తారు. రోజుకో విధమైన నివేదనలు సమర్పిస్తారు. చెరువులు, కుంటల దగ్గర బతుకమ్మలతో చేరుకుంటారు. వాటిని పేర్చి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడుతారు. ఆఖరి రోజున బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. బతుకమ్మను పేర్చడానికి పూల సేకరణను తెల్లవారుజామునే ప్రారంభిస్తారు. బంతి, చామంతి, గునుగు, గుమ్మడి, తంగేడు... ఇలా ఎన్ని పూలు ఉన్నా తంగేడుకే ప్రాధాన్యం. ఇది పసుపు వర్ణంలో ఉంటుంది. పసుపు అయిదవ తనానికి సంకేతం. అలాగే పసుపును ముద్దగా చేసి, గోపురం రూపంలో నిర్మించి, దాని మధ్యలో నొక్కి రెండు శిఖరాలుగా చేస్తారు.

అది అర్ధనారీశ్వరులకు సంకేతం. ఆ గోపురం చుట్టూ పూల దండలను అలంకరిస్తారు. రోజుకో నైవేద్యాన్ని పెడతారు. 'తీరొక్క పువ్వేసి, తీరొక్క కూర్పుగా ఉయ్యాలో' అంటూ బతుకమ్మల కూర్పును, పేర్పును ప్రస్తావిస్తారు. 'చిక్కుడూ ఆకులో ఉయ్యాలో... సద్దులు పెట్టేము ఉయ్యాలో' అంటూ నైవేద్యాల విశేషాలను వివరిస్తారు. వేడుకల్లో చివరి రోజైన ఆశ్వయుజ శుద్ధ అష్టమి నాడు గౌరిని మెట్టినింటికి పంపే సంరంభం వైభవంగా జరుగుతుంది. ఇంటి ఆడపడుచులకు ఒడిబియ్యం పోసి, చీరసారెలతో మెట్టినింటికి పంపినట్టు... బతుకమ్మను సాగనంపుతారు.

శ్రీగౌరి నీ పూజ ఉయ్యాలో – చిత్తములో తలతుమమ్మ ఉయ్యాలో
మా లక్ష్మి మా గౌరి ఉయ్యాలో – పోయి రావమ్మ ఉయ్యాలో
కైలాసగిరివాసి ఉయ్యాలో – శంకరీ పార్వతీ ఉయ్యాలో

... అంటూ బరువెక్కిన హృదయాలతో వీడ్కోలు చెబుతారు. అష్టమినాటి చంద్రకళలు ప్రసరిస్తూ ఉండగా... బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. అంతటితో బతుకమ్మ సంబరాలు ముగుస్తాయి. ఇది పూల పండుగ. ఆడపిల్లల పండుగ, అక్కచెల్లెళ్ళ పండుగ, అమ్మ అమ్మమ్మల పండుగ. అందరికీ ఆటా పాటా నేర్పే పండుగ. సంగీత, సాహిత్య, నాట్యాల మేళవింపుగా... వర్ణ, వర్గ విచక్షణ లేకుండా సమైక్యతను చాటి చెప్పే పండుగ.

## చర్మం కోమలంగా!



**క్లీనింగ్:** మాయిశ్చరైజర్ వల్ల చర్మం తేమగా ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే! అయితే అంతకంటే ముందు చర్మం మీద పేరుకునే మృతకణాలను తొలగించుకోవాలి. ఇందుకోసం రోజు విడిచి రోజు మెత్తని బియ్యం పిండి, నిమ్మరసం, తేనె, పెరుగు మిశ్రమంతో ముఖ చర్మాన్ని కొద్దిసేపు మర్దన చేసి కడిగేసుకోవాలి. ఆ తర్వాత మెత్తని తువ్వాలుతో తుడుచుకుని, మాయిశ్చరైజర్ పూసుకోవాలి.తేమగా: చర్మానికి తేమ అవసరం. ఇది వ్యక్తికీ, వ్యక్తికీ, కాలానికీ మారుతూ ఉంటుంది. పొడిచర్మం కలిగిన వాళ్లు నీటి ఆధారిత మాయిశ్చరైజర్, జిడ్డుచర్మం కలిగినవాళ్లు ఆయిల్ బేస్‌డ్ మాయిశ్చరైజర్ వాడుకోవాలి. వీలైతే మీగడ, తేనె, నిమ్మరసం మిశ్రమం ముఖానికి పూసుకుని ఆరిన తర్వాత కడిగేసుకోవాలి. ఇలా ప్రతి మూడు రోజులకు ఒకసారి చేస్తూ ఉండాలి.ఎక్స్‌ఫోలియేట్: చర్మం మెరుపులీనాలంటే మృత కణాలు తొలగించాలి. ఇందుకు తగిన సమయం రాత్రివేళ. అయితే ముఖం మీద మొటిమలు ఉన్నా, చర్మం కంది ఉన్నా ఎక్స్‌ఫోలియేట్ చేయకూడదు. దీనికి బదులుగా సెనగపిండి, పాలు, గులాబీ నీళ్లు కలిపిన మిశ్రమం ముఖం మీద పూసుకుని, ఆరిన తర్వాత కడిగేసుకోవాలి.సన్‌స్క్రీన్: సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాలు చర్మానికి హాని చేస్తాయి. వీటి నుంచి కాపాడుకోవడానికి సన్‌స్క్రీన్ వాడడం తప్పనిసరి. అయితే ఎండ తీవ్రత ఉన్నా, లేకపోయినా, సూర్యకిరణాలు సోకడం వల్ల చర్మం రంగుమారడం ఆగదు. కాబట్టి సన్‌స్క్రీన్ లోషన్ వాడడం తప్పనిసరి.

# నకిలీ ప్రొఫైల్‌తో ఎర.. ఆపై బ్లాక్‌మెయిలింగ్





**రంగు బాలలక్ష్మీగౌడ్... కష్టాలు, కన్నీళ్లు, అవమానాలు, ఛీత్కారాలు... సినిమా కథకు ఏమాత్రం తీసిపోదు ఆమె జీవితం. అన్నిటినీ భరించి... ఉద్యమ బాటలో నడిచి... యువతరానికి స్ఫూర్తిమంత్రమయ్యారు.**

మగరాయుడని వెక్కిరించారు

రంగు బాలలక్ష్మీగౌడ్... కష్టాలు, కన్నీళ్లు, అవమానాలు, ఛీత్కారాలు... సినిమా కథకు ఏమాత్రం తీసిపోదు ఆమె జీవితం. అన్నిటినీ భరించి... ఉద్యమ బాటలో నడిచి... యువతరానికి స్ఫూర్తిమంత్రమయ్యారు. 'తెలంగాణ బీసీ కమిషన్'లో మొట్టమొదటి మహిళా సభ్యురాలిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తన పోరాట నేపథ్యాన్ని బాలలక్ష్మి 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.

"తెలంగాణ బీసీ కమిషన్ సభ్యురాలిగా బాధ్యతలు స్వీకరించిన క్షణం నా హృదయం ఆనందంతో ఉప్పొంగింది. ఏ తెలంగాణ కోసమైతే ప్రాణాలకు తెగించి పోరాడానో, ఆ తెలంగాణ రాష్ట్ర చిహ్నం చెంతన ఉన్నత హోదాలో కొలువుదీరడం ఎంతో ఉద్వేగానికి గురి చేసింది. ఆ మధుర క్షణంలో నా గతం కళ్లముందు కదలాడింది. ఉమ్మడి వరంగల్ జిల్లా 'మద్రి ముచ్చాల' అనే మారుమూల పల్లెటూరులో ఓ నిరుపేద కల్లుగీత కార్మికుడి కూతురినైన నేను... ఇవాళ ఇక్కడి వరకు రాగలిగానంటే అదంతా తెలంగాణ పోరాట ఫలితమే.

మా అమ్మానాన్న ఐలయ్యగౌడ్, సువర్ణ. ఐదుగురు కూతుళ్లలో పెద్దమ్మాయిని. అప్పుడు నాకు ఆరేళ్లు ఉంటాయి. ఒకరోజు తెల్లవారుజామున పోలీసులు మా ఇంటికొచ్చి, తాటి చెట్లు ఎక్కడం, కరెంటు పని తప్ప మరో లోకం తెలియని మా నాన్నను 'నక్సలైట్ల ఇన్ఫార్మర్' అంటూ చిత్రహింసలు పెట్టారు. తనకేమీ తెలియదని నాన్న మొత్తుకున్నా వినకుండా అరెస్టు చేశారు. ఐలయ్య పేరుగల మరొకరి కోసం గాలిస్తూ, అదే పేరుగల మా నాన్నను పొరపాటున తీసుకెళ్లామని తెలుసుకొని, తర్వాత విడుదల చేశారు. ఖాకీ డ్రెస్‌కు అంత పవర్ ఉంటుందని చూసి, నిర్ఘాంతపోయాను. పెద్దయ్యాక నేనూ పోలీసు అవ్వాలని బలంగా నిశ్చయించుకున్నా. అయితే మనం ఒకటి తలిస్తే, విధి మరొకటి తలుస్తుంది అన్నట్టు తొమ్మిదో తరగతిలో ఉండగానే నాకు పెళ్లి చేశారు. అది నా జీవితంలో పెద్ద కుదుపు.

**అక్కడే తొలి అడుగు...**

పెళ్లి అయ్యి నెలలు గడుస్తున్నా... అత్తింటివాళ్లు నన్ను తీసుకెళ్లలేదు. 'బాధపడుతూ కూర్చోవద్దు. మళ్లీ చదువు కొనసాగించ'మని నాయనమ్మ చెప్పింది. మా ఊరి హైస్కూల్లో చేరదామని వెళితే... 'విద్యా సంవత్సరం మధ్యలో చేరి, మళ్లీ ఫెయిల్ అయితే స్కూలుకు చెడ్డ పేరు' అని హెడ్‌మాస్టర్ కుదరదన్నారు. 'ఈ అమ్మాయి మంచి మార్కులు తెచ్చుకుంటుంది చూడండి' అని సుధాకర్ మాస్టారు నచ్చజెప్పడంతో నన్ను తరగతి గదిలోకి వెళ్లనిచ్చారు. ఆయన అన్నట్టుగానే పదో తరగతిలో ఫస్ట్‌క్లాసులో ఉత్తీర్ణత సాధించాను. చేర్యాలలో ఇంటర్ పూర్తయ్యాక, సిద్ధిపేటలో డిగ్రీలో చేరాను. అక్కడ నాకు సమాజాన్ని అర్థం చేసుకోవడానికి అవసరమైన సామాజిక అంశాలు పరిచయమయ్యాయి. మా తెలుగు అధ్యాపకుడు నందిని సిధారెడ్డి సారు కవిత్వం చదవడం ద్వారా తెలంగాణ అస్తిత్వ సోయి మాలో కలిగింది. గద్దరన్న పాటలు, ప్రొఫెసర్ జయశంకర్ సారు రాతలు, కాళోజీ కవితలు నాకు చైతన్య ప్రబోధాలయ్యాయి. వాటన్నింటి ప్రభావంతో ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష నాలో బలంగా నాటుకుంది.

**నా లక్ష్యం ముఖ్యం కాదనుకున్నా...**

నా జీవితాన్ని మలుపు తిప్పింది ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఎకనామిక్స్ పోస్టు గ్రాడ్యుయేషన్‌కు ఆర్ట్స్ కళాశాలలో అడుగుపెట్టాను. ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు సబ్‌ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి సన్నద్ధమయ్యాను. అయితే ప్రిలిమ్స్‌లో విజయం సాధించినా, పరుగు పోటీలో కొద్ది తేడాతో అవకాశం చేజారింది. పీజీ పూర్తయ్యాక, ఉస్మానియా లా కాలేజీలో ఎల్‌ఎల్‌బీలో చేరాను. అది 2009... నవంబర్ 30. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మలుపు తీసుకొంటున్న సందర్భం... క్యాంపస్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో మొదటి సంవత్సరం లా పరీక్షలు వాయిదా పడ్డాయి. గ్రూప్స్ ద్వారా డీఎస్పీ కావచ్చన్న ఉద్దేశంతో ఓయూ హాస్టల్‌లోనే ఉంటూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. ఆ సమయంలో నా పీజీ క్లాస్‌మేట్ శ్రీను ఫోన్ చేసి, 'ఆర్ట్స్ కాలేజీ దగ్గర విద్యార్థుల తలకాయలు పగులుతుంటే, మీరు హాస్టల్‌లో కూర్చొని చదువుకుంటున్నారా' అన్నాడు. అసలు ఏమైందా అని టీవీ పెడితే కానీ మాకు తెలియలేదు అంత పెద్దఎత్తున నిరసన జ్వాలలు ఎగసిపడుతున్నాయని. ఇక ఆలోచించలేదు. హాస్టల్‌లో ఉన్న విద్యార్థినులను వెంటబెట్టుకుని ర్యాలీకి వెళ్లాను. ఆ రోజు నుంచి వెనక్కి తిరిగి చూడలేదు. పోలీసు అవ్వాలన్న నా లక్ష్యంకన్నా తెలంగాణ సాధనే అత్యంత ముఖ్యం అనిపించింది.

**మొదటి అమ్మాయిని...**

మలి దశ తెలంగాణ పోరాటంలో భాగంగా ఓయూలో సాగిన రిలే నిరాహార దీక్షలో కూర్చున్న మొట్టమొదటి అమ్మాయిగా నన్ను గూడ అంజయ్య లాంటి ప్రముఖ కవి గుర్తించి, పూల మాలతో సత్కరించారు. నా జీవితంలో మరిచిపోలేని మధురానుభూతి అది. ఓయూ విద్యార్థి జాయింట్ యాక్షన్ కమిటీ అధికార ప్రతినిధిగా... విద్యార్థి మహాగర్జన, మహాపాదయాత్ర, ఛలో అసెంబ్లీ, మిలియన్ మార్చ్, పొలికేక ఇలా... తెలంగాణ కోసం సాగిన ప్రతి కార్యక్రమంలో ముందున్నాను. హైకోర్టులో తెలంగాణ న్యాయవాదుల దీక్షకు మద్దతుగా 30మంది విద్యార్థులను వెంట తీసుకెళ్లిన నన్ను ఒక లేడీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దారుణంగా కొట్టింది. నా కుడి చెయ్యి వెనక్కి విరిచిమరీ పిడిగుద్దులు గుద్దింది. ఇప్పటికీ ఆ చెయ్యి వెనక్కి వంచలేను. మరొక సందర్భంలో పోలీసులు ఉరికించి కొట్టడంతో స్పృహతప్పి పడిపోయాను. రబ్బరు బుల్లెట్లు, పెల్లెట్లు... ఒక్కటి కాదు, ఎన్నో దెబ్బలు తిన్నాను. అయినా, భయపడలేదు. ఒకరోజు మా నాన్న ఫోన్ చేసి 'అమ్మా... నీకేమైనా అయితే భరించలేం. ఉద్యమాలు మనకు వద్దు' అన్నాడు. ఆ వెంటనే అమ్మ కల్పించుకొని, 'అది పోతే, మనకు ఇంకా నలుగురున్నారు.

అమ్మాయిని ఆపకు' అన్న మాటలు... ఇప్పటికీ నా చెవుల్లో మార్మోగుతున్నాయి. ఒకటా రెండా... 500కు పైగా సభల్లో తెలంగాణ గళాన్ని వినిపించాను. నా మీద అటెంప్ట్ టు మర్డర్‌తో పాటు 30 కేసులు బనాయించారు. ఆ సమయంలో నా నలుగురు చెల్లెళ్లు ఆర్థిక సాయం అందించారు. మరెంతో మంది అండగా నిలిచారు. తెలంగాణ మలిదశ పోరాట చరిత్రలో ఆర్ట్స్ కాలేజీది ప్రముఖ అధ్యాయమైతే, అందులో నేనూ ఒక పేజీ అయినందుకు గర్వంగా ఉంది.

**కారు... కరెన్సీ లేకున్నా...**

అదే ఓయూ నుంచి ఎల్‌ఎల్‌ఎమ్ పట్టా పొందాను. ప్రస్తుతం అక్కడే 'రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం' అంశం మీద పీహెచ్‌డీ చేస్తున్నాను. 2016లో నన్ను రేవంత్ అన్న కాంగ్రెసలోకి ఆహ్వానించారు. పార్టీ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ కోఆర్డినేటర్‌గా, తుంగతుర్తి నియోజకవర్గం పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా... ఇలా నాకు అప్పగించిన ప్రతి బాధ్యతనూ శక్తివంచన లేకుండా నిర్వర్తించాను. నా నిజాయితీకి దక్కిన గుర్తింపు, గౌరవమే బీసీ కమిషన్ సభ్యురాలి పదవి. అన్ని పార్టీల్లో నన్ను అభిమానించేవాళ్ళు ఉన్నట్టే, అవమానించేవాళ్ళూ ఉంటారు. "సొంతిల్లు, కారులేని ఆమె ఎమ్మెల్యే ఎలా అవుతుంది. ఆటోల్లో బస్సుల్లో తిరిగే తనకు ఈ రాజకీయాలు అవసరమా' అని నా ముందే హేళన చేసినవారున్నారు. 'మగరాయుడు లెక్క కుర్తాపైజమా వేసుకుంటుంద'ని నా వస్త్రధారణను వెక్కిరించిన వారున్నారు. అవేవీ పట్టించుకోలేదు. నా అంతిమలక్ష్యం చట్టసభల్లో అడుగుపెట్టడమే. కారు, కరెన్సీ, ఖద్దరు లేకున్నా బహుజన ఆడబిడ్డలు రాజకీయాల్లో రాణించగలరన్న నమ్మకాన్ని కలిగించడానికి నా వంతు ప్రయత్నిస్తాను."


**పెళ్లి పెద్దగా బాపూజీ...**

నన్ను తెలంగాణ మలిదశ పోరాటంవైపు నడిపించిన నా క్లాస్‌మేట్ కందకట్ల శ్రీనివాసతో 2011లో నా వివాహమైంది. ఆయనది జనగాం దగ్గర నర్మేట గ్రామం. చేనేత కుటుంబ నేపథ్యం. నా మీద వాత్సల్యం కొద్దీ మా పెళ్లి పెద్దగా వ్యవహరించిన కొండా లక్ష్మణ్ బాపూజీ "నేత- గీత బంధం ఈనాటిది కాదు" అని మమ్మల్ని దీవించారు. మాకు ఒక అమ్మాయి. చే గువేరా మీద అభిమానంతో పాపకు 'చేశ్రీ' అని పేరు పెట్టాం

**అలా కించపరచడం తగదు...**

తెలంగాణ మలిదశ పోరు సమయంలో మద్దతు ప్రకటించడానికి ఓ రోజు మా దీక్షా శిబిరానికి వచ్చిన ఒక నాయకుడు ప్రసంగిస్తూ, 'మనమేమీ చేతులకు గాజులు తొడుక్కోలేదు' అని ప్రస్తావించాడు. ఆయన మాటలకు నేను అడ్డుపడి, "అన్నా! ఆడవాళ్ళను కించపరిచేలా మాట్లాడద్దు" అని హెచ్చరించాను. ఆ నాయకుడు సభాముఖంగానే తన తప్పు ఒప్పుకొని క్షమాపణలు తెలిపాడు. ఈ రోజుకూ చాలామంది రాజకీయ నాయకులు 'చీర, గాజులు' అంటూ స్త్రీలను కించపరిచేలా మాట్లాడుతున్నారు. అలాంటి వాటిని ఒక మహిళగా ఉపేక్షించను.

# నామెదడులో చిప్ పెట్టారు



"నా మెదడులో ఏదో ఉంది. అమెరికాలోని ఫెడరల్ పోలీసులు నా మెదడును ట్యాప్ చేస్తున్నారు. వెంటనే నన్ను రక్షించండి. ప్లీజ్. నాకు పిచ్చెక్కిపోతోంది." – బెంగళూరులో ఓ మహిళా టెకీ ఫిర్యాదు.

'పంజాబ్‌లో 'సూపర్‌కాప్'గా పేరు పొందిన కేపీఎస్ గిల్ నామెదడులో చిప్ పెట్టారు. ఆయన నా ఆలోచనలను నియంత్రిస్తున్నారు. ఇది దారుణం." – ఓ యువకుడి ఆరోపణ

"పోలీసులు నా ఆలోచనలను కనిపెట్టేస్తున్నారు. నా భర్త సాయంతో వారు నా మెదడును నియంత్రిస్తున్నారు". – తమిళనాడులో గృహిణి వేదన.. చాలా విచిత్రంగా అనిపిస్తున్నా.. ఈ ఫిర్యాదులు..ఈ వేదనలు నిజమే. దేశంలో చాలా మంది ఏదేదో ఊహించుకుంటూ.. చిత్ర విచిత్రంగా భ్రమపడుతూ.. పోలీసులు, మానవ హక్కుల సంఘాలకు రకరకాల ఫిర్యాదులు చేస్తున్నారు. ఎందుకిలా అని నిపుణులు ఆరా తీస్తే.. వీరు 'పారనోయా' అనే మానసిక రుగ్మతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఇటీవల కొంతకాలంగా ఉద్యోగులు.. యువతలో ఈ సమస్య పెరుగుతున్నట్లు మానసిక వైద్యులు చెబుతున్నారు. ఒకే విషయాన్ని పదే పదే ఆలోంచి.. ఆందోళన పెంచుకోవడం వల్ల ఈ సమస్య వస్తుందని వారు వివరించారు. పారనోయా మాత్రమే కాదు.. కుంగుబాటు, ఒత్తిడి, ఆందోళన ఇలా రకరకాల మానసిక సమస్యలతో దేశంలో దాదాపు 20 కోట్ల మంది బాధపడుతున్నట్లు అంచనా. ఈ విషయాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఏర్పాటు చేసిన బెంగళూరులోని జాతీయ మానసిక ఆరోగ్యం, నాడీ శాస్త్ర సంస్థ (నిమ్‌హాన్స్) కమిటీ స్పష్టం చేసింది .ఇది దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో అధ్యయనం చేసిన మరీ ఈ విషయాన్ని వెల్లడించింది. దేశంలో మానసిక సమస్యలు పెరిగిపోతున్నాయని గుర్తించిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఈ సమస్యలపై అధ్యయనానికి 2014లో నిమ్‌హాన్స్‌ను నియమించింది. అప్పటి నుంచి ఈ సంస్థ ఏటా దేశంలో మానసిక సమస్యలపై అధ్యయనం చేస్తోంది.

**ఎవరికి ఏం సమస్య!!**

దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 10.1 శాతం నుంచి 14.1 శాతం మంది ప్రజలు తీవ్రమైన మానసిక సమస్యలతో బాధపడుతున్నటు అంచనా.

10 శాతం మందిలో కుంగుబాటు, ఆందోళన, వ్యసనాలు అధికం.

ప్రతి 20 మందిలో ఒకరు కుంగుబాటుతో బాధపడుతున్నారు. మహిళల్లో ఇది ఇంకా ఎక్కువ.

18 ఏళ్లకుపైబడిన వారిలో 22.4 శాతం వ్యసనపరులే.

వ్యసనాల్లో మద్యపానం, పొగాకు నమలడం, ధూమపానమే అధికం పురుషుల్లోనే అధికం!!

కుంగుబాటు, మూడ్ డిజార్డర్లు తప్ప మిగతా మానసిక సమస్యలు పురుషులకే ఎక్కువ. మొత్తానికి 13.9 శాతం మంది పురుషులు మానసిక రోగులు. మహిళల్లో ఈ రేటు 7.5 శాతం.

13 నుంచి 17 ఏళ్ల మధ్య వారిలో 7.3 మంది మానసిక సమస్యలతో బాధపడుతున్నవారే.

చికిత్సకు దూరం!!

తీవ్రమైన మానసిక సమస్యలతో బాధపడుతున్న వారిలో కేవలం 25 శాతం మంది మాత్రమే చికిత్స తీసుకుంటున్నారు.

మిగతవారు అస్సలు తమకు మానసిక సమస్య ఉన్నట్లే వైద్యులకు చెప్పడం లేదు. ఇతరులు ఏమనుకుంటారో నని వీరు చికిత్సకు వెనుకాడుతున్నారు. ఏడాది పాటు కుంగుబాటు, ఒత్తిడి, ఇతర సమస్యలతో బాధపడుతున్నా వైద్యుల ముందుకు వెళ్లడం లేదు.

వీరికి చికిత్స అందించాలంటే ఒక్కొక్కరికి నెలా రూ.1000 నుంచి 1500 వరకు ఖర్చవుతుంది.

**ఇదీ కారణమే!!**

మానసిక సమస్యలను తక్కువ తీవ్రంగా పరిగణించడం.. దీనికి తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో ప్రజలు చికిత్సకు ముందుకు రావడం లేదని నిపుణులు అంటున్నారు. చాలా మంది వైద్యులు సైతం మానసిక సమస్యలను తీవ్రంగా గుర్తించడం లేదని వారు పేర్కొంటున్నారు.

**కారణాలు**

మారిన జీవనశైలి

అనవసరంగా ఒత్తిడికి గురికావడం

జీవన విధానంలో నాణ్యత లేమి

చిన్న కుటుంబాలు

ఆర్థిక అస్థిరత

అతిగా ఫోన్లు..నెట్ వినియోగం

నిద్రలేమి, వ్యసనాలు

పట్టణాలు, నగరాల్లో అధికం!

గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే.. పట్టణాలు, నగరాల్లోనే ఎక్కువ మంది మానసిక

# అమ్మా... మీకిదే వందనం!




"అమ్మా! ఇలా రా!" అంటూ మూడేళ్ల కూతురు ఏడుస్తూ పిలుస్తుంటే దగ్గరకు వెళ్లలేకపోయిందా తల్లి! కొవిడ్ –19 ఐసొలేషన్ వార్డులో, నర్సు విధుల్లో ఉన్న ఆ తల్లి కుటుంబానికి దూరంగా ఉండవలసిన పరిస్థితి! అందుకునేంత దూరంలో ఉన్నా, అమ్మ కావాలంటూ ఏడుస్తున్న కూతురిని గుండెలకు హత్తుకోలేని నిస్సహాయత ఆమెది! కర్ణాటక ముఖ్యమంత్రిని సైతం కదిలించిన ఆ దృశ్యం వెనకున్న కథ ఇది!పాపకు దూరంగా...

"నాన్నా! నన్ను అమ్మ దగ్గరకు తీసుకువెళ్లు" అంటూ మూడు రోజులుగా గుక్కపెట్టి ఏడుస్తున్న మూడేళ్ల కూతురు ఐశ్వర్యను సముదాయించలేక, టు వీలర్ ఎక్కించుకుని భార్య సుగంధ పని చేస్తున్న ఐసొలేషన్ వార్డు దగ్గరకు తీసుకువెళ్లాడు తండ్రి. అది కర్నాటకలోని బెలగావి జిల్లాలో, క్వారెంటైన్ సెంటర్. దాన్లో గత వారం రోజులుగా సుగంధ స్టాఫ్ నర్సుగా కొవిడ్ రోగులకు నిరంతర సేవలందిస్తోంది. కుటుంబాన్ని కలిసి అప్పటికే వారం దాటింది. ఇంటికి వెళ్లాలంటే మరో వారం రోజులు ఆగాలి. కానీ కూతురి నుంచి అన్ని రోజుల పాటు దూరంగా ఉండడం ఇదే తొలిసారి. పాపను చూడాలని మనసు ఆరాటపడుతున్నా, తన వైద్య సేవల అవసరానికి ప్రాధాన్యమిచ్చి వార్డుకే పరిమితమైపోయింది సుగంధ. అయితే కూతురు ఐశ్వర్య తల్లిని అన్ని రోజుల పాటు చూడకుండా ఉండలేకపోయింది.అమ్మ దగ్గరకు తీసుకువెళ్లమని ఏడ్చింది, అన్నం తినడం మానేసింది. దాంతో చేసేదిలేక సుగంధ పని చేస్తున్న వార్డు దగ్గరకు తీసుకొచ్చాడు సుగంధ భర్త. అయితే తల్లి దగ్గరకు బిడ్డను తీసుకువెళ్లే వీలు లేదు. వాళ్లిద్దరూ ఒకరికొకరు కనిపిస్తున్నా, దూరం నుంచే పలకరించుకునే పరిస్థితి. పాప ఏడుస్తూ, "అమ్మా! నా దగ్గరకు రా!" అని పిలుస్తున్నా, కళ్ల నుంచి ఉబికివచ్చే కన్నీరు తుడుచుకుంటూ, అరచేతిని ఊపడం తప్ప ఏమీ చేయలేకపోయుందా తల్లి. ఈ దృశ్యం అక్కడ ఉన్న వారినందరికీ కంటతడి పెట్టించింది.

ముఖ్యమంత్రి ఫోన్‌కాల్!...ఈ సంఘటన వీడియో వైరల్‌గా మారి రాష్ట్ర ముఖ్యమంత్రి యడ్యూరప్పకూ చేరింది. ఆ వీడియో చూసిన ఆయన, స్వయంగా సుగంధకు ఫోన్ చేసి ఆమె వృత్తి నిబద్ధతను కొనియాడారు. ఆ సందర్భంగా కొవిడ్ విధుల్లో ఉన్న వైద్య సహాయకులకు ఎదువుతున్న ఇబ్బందులను ఆమె ముఖ్యమంత్రికి చెప్పింది. ఆ ఇబ్బందులన్నీ తీరేలా తను స్వయంగా చొరవ తీసుకుంటానని ముఖ్యమంత్రి తర్వాత ఆమెకు ఉత్తరం రాయడం విశేషం. ఈ విషయం గురించి చెబుతూ... "ముఖ్యమంత్రి స్వయంగా ఫోన్ చేసి మాట్లాడడం ఒక ఎత్తైతే, నేను ఏకరువు పెట్టిన విషయాలను ఓపికగా విని, ఆ ఇబ్బందులను తీరుస్తానని హామీ ఇస్తూ నాకు ఉత్తరం రాయడం మరో ఎత్తు. ఆశా హెల్త్ వర్కర్లు, పారామెడిక్ స్టాఫ్, నర్సులు, డాక్టర్లు, శానిటేషన్ వర్కర్ల సేవలను ముఖ్యమంత్రి కొనియాడారు. వృత్తిలో భాగంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగేలా చర్యలు తీసుకుంటానని కూడా హామీ ఇచ్చారు. అలాగే ముఖ్యమంత్రి మా వైరల్ వీడియో చూసి ఎంతో చలించిపోయారు.

# తల్లులకు.. హగ్ ఇవ్వొద్దు



వారం రోజులు ఊరెళితే అమ్మను చూడకుండా ఉండలేం. మాట్లాడకుండా అస్సలు ఉండలేం. ఇంటికి వచ్చిన వెంటనే ఆమెను హత్తుకుంటాం. ఆనందంతో తల్లీబిడ్డలిద్దరూ మురిసిపోతారు. ఇక, మదర్స్‌డే వచ్చిందంటే.. పాశ్చాత్యదేశాల్లో హగ్‌లు ఇచ్చుకోవడం సహజం. కరోనా వల్ల సామాజిక దూరం పాటించక తప్పడం లేదు. 'మదర్స్‌డే శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చే పిల్లలు.. తల్లికి హగ్ ఇవ్వకూడదు. అలాచేస్తే ఆమె ప్రాణాలకే ముప్పు తెచ్చినవాళ్లు అవుతారు' అంటూ ఆస్ట్రేలియా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మదర్స్‌డే వేడుకను కూడా పదిమందికి మించి చేసుకోవద్దంటూ హెచ్చరించింది.

తల్లులకు ఎలాంటి కానుకలు ఇవ్వకూడదు. పూలబొకేలు కూడా దూరం నుంచే అందివ్వాలి. ఇంట్లో అందరూ ఒకటిన్నర మీటరు దూరం నుంచే అమ్మకు శుభాకాంక్షలు చెప్పాలి. ఎందుకంటే వయసు మీదపడిన మాతృమూర్తులకు కరోనా సులభంగా సోకే ప్రమాదం ఉంది.. పిల్లలూ జాగ్రత్త అంటూ ఆ ప్రభుత్వం సూచించింది. మదర్స్‌డే రోజున అమ్మను హగ్ చేసుకోవద్దంటూ ఒక దేశ ప్రభుత్వం.. ఇలా అధికారికంగా ఆదేశాలు జారీచేయడం బహుశా ఇదే తొలిసారి అనుకుంటా.






## అంతకంతకు దిగజారిపోతోంది.. హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్

హైదరాబాద్-నవభూమి:ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో ముందంజలో ఉండే హైదరాబాద్ మహానగర స్థానం ఇప్పుడు అంతకంతకు దిగజారిపోతోంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ మార్కెట్ అధ్యయన సంస్థ జేఎల్ఎల్ వెల్లడించిన ప్రస్తుతేడాది మూడో త్రైమాసికపు(జూలై-సెప్టెంబర్ మధ్యకాలం) ప్రకారం ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో దేశ వ్యాప్తంగా 14 శాతం మేర వృద్ధిని నమోదు చేసుకుంటే ఇటు హైదరాబాద్‌లో మాత్రం భారీగా తగ్గింది. మెట్రో నగరాల వారిగా చూస్తే హైదరాబాద్‌లో గతేడాది ఇదే త్రైమాసికంలో 2.70 మిలియన్ల చదరపు అడుగులు లీజుకు తీసుకుంటే, తాజాగా ఈ త్రైమాసికంలో మాత్రం 1.26 మిలియన్ చదరపు అడుగులకు పడిపోయింది.ఆఫీసు స్పేస్ వినియోగం సగానికి తగ్గిందని నివేదిక వెల్లడించింది. అదే సమయంలో ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, పుణె నగరాల్లో మంచి వృద్ధి రేటు నమోదైంది. హైదరాబాద్‌కు ఐటీ రంగం పరంగా ప్రధాన పోటీగా ఉన్న బెంగళూరులో జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో 4.14 మిలియన్ చదరపు అడుగులు లీజుకు తీసుకోవడం విశేషం. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ తగ్గుతూ వస్తుందనడానికి ఆఫీసు స్పేస్ లీజింగ్ అంశమే అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

# మదుపరిపై కాసుల వర్షం



న్యూఢిల్లీ-నవభూమి: ఆల్‌టైమ్ హై రికార్డుల్లో పరుగులు పెడుతున్న దేశీయ స్టాక్ మార్కెట్లు.. అదే స్థాయిలో మదుపరులకు లాభాలను తెచ్చిపెడుతున్నాయి. ఈ ఏడాది ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లపై కాసుల వర్షం కురిసింది మరి. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) నమోదిత సంస్థల మార్కెట్ విలువ ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా రూ.110.57 లక్షల కోట్లు ఎగిసింది. గడిచిన 9 నెలల్లో నిరంతర మార్కెట్ ర్యాలీ.. మదుపరుల సంపదను రూ.110,57,617.40 కోట్లు పెంచి రూ.4,74,86,463.65 కోట్ల (5.67 ట్రిలియన్ డాలర్లు)కు చేర్చింది. గత నెల 27న మునుపెన్నడూ లేనివిధంగా రూ.477.93 లక్షల కోట్లను తాకడం గమనార్హం.
బీఎస్ఈలో పెద్ద, మధ్య, చిన్న శ్రేణి సూచీలుగా చెప్పుకొనే సెన్సెక్స్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు ఈ ఏడాది దుమ్మురేపాయి. సెన్సెక్స్ 12,026.03 పాయింట్లు లేదా 16.64 శాతం ఎగబాకింది. ఈ ఏడాది ఆరంభంలో 72,271.94 వద్దే ఉండగా, ఇప్పుడు 84,266.29 వద్ద ఉన్నది. ఇక సెప్టెంబర్ 27నైతే ఆల్‌టైమ్ హై 85,978.25 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సైతం 12,645.24 పాయింట్లు లేదా 34.32 శాతం పుంజుకున్నది. స్మాల్‌క్యాప్ 14,777.09 పాయింట్లు లేదా 34.62 శాతం పెరిగింది. దీంతో ఓవరాల్‌గా బ్లూచిప్, మిడ్, స్మాల్‌క్యాప్ షేర్లలో పెట్టుబడులు పెట్టిన సగటు మదుపరికి ఈ ఏడాది లాభాలు దక్కాయనే చెప్పవచ్చు.
ఫిబ్రవరి 1 నుంచి..వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 మొదలు క్వాలిఫైడ్ స్టాక్ బ్రోకర్లు సైతం ఏఎస్‌బీఏ సౌకర్యం మాదిరే తమ క్లయింట్లకు యూపీఐ ఆధారిత బ్లాక్ మెకానిజంను వినియోగించి సెకండరీ మార్కెట్‌లో ట్రేడింగ్ సదుపాయాన్ని కల్పించాల్సి ఉంటుంది. లేదా 3 ఇన్ 1 ట్రేడింగ్ ఖాతా (సేవింగ్స్, డీమ్యాట్, ట్రేడింగ్ అకౌంట్లు ఒకే అకౌంట్‌లో కలిసి ఉన్న) సదుపాయాన్నైనా ఇవ్వాల్సి ఉంటుంది. మదుపరుల సాధికారతే లక్ష్యంగా సెబీ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. ఇదిలావుంటే మున్సిపల్ బాండ్ల సబ్‌స్క్రైబర్స్ కోసం పన్ను ప్రోత్సాహకాలను తేవాలని కేంద్ర ప్రభుత్వాన్ని సెబీ కోరింది. అప్పుడే డిమాండ్ బాగుంటుందని అభిప్రాయపడింది. మౌలికాభివృద్ధికి కావాల్సిన నిధుల కోసం ఈ బాండ్లను సర్కారు విక్రయిస్తున్న విషయం తెలిసిందే. మౌలిక రంగ ప్రాజెక్టుల కోసం బాండ్ల ద్వారా 1997 నుంచి మున్సిపాలిటీలు రూ.2,700 కోట్లను సమీకరించాయి.
ఈ ఏడాది దేశీయ స్టాక్ మార్కెట్లు ఇంతలా మదుపరులకు లాభాలను పంచిపెట్టడానికి కారణం మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీలోకి భారీ ఎత్తున వచ్చిన పెట్టుబడులే. విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్‌ఐఐ) నుంచి అమ్మకాల ఒత్తిడి కొనసాగుతున్నా.. ఈక్విటీ మార్కెట్లు రికార్డు హైలను చేరుతూపోయాయి. దేశీయ మదుపరులు కొనుగోళ్లకు పెద్దపీట వేయడం ఇందుకు కలిసొచ్చింది. అలాగే మిడ్, స్మాల్‌క్యాప్ సూచీల్లో పెట్టుబడులు రిటైల్ ఇన్వెస్టర్లకు లాభించాయి. మొత్తంగా చూసినైట్టైతే ఈ 2024 సంవత్సరం భారతీయ స్టాక్ మార్కెట్లలో ఎప్పుడూలేని ఉత్సాహాన్ని నింపింది.
-సంతోష్ మీనా, స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ లిమిటెడ్ రిసెర్చ్ హెడ్
గడిచిన కొద్దివారాలుగా భారతీయ స్టాక్ మార్కెట్లలో జరుగుతున్న ర్యాలీ.. అమెరికా ఫెడ్ రిజర్వ్ తగ్గించిన వడ్డీరేట్లు, రాబోయే ద్రవ్యసమీక్షల్లోనైనా ఆర్బీఐ వడ్డీరేట్లకు కోత పెడుతుందన్న ఆశలతోనేనని చెప్పవచ్చు. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలున్నా అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో నడుస్తుండటం కూడా దేశీయ స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్‌మెంట్ సెంటిమెంట్‌ను పెంచింది. గత నెల కేవలం వారం రోజుల్లోనే సెన్సెక్స్ 2వేల పాయింట్లు పెరగడం మార్కెట్‌లో కొనుగోళ్ల ఉత్సాహానికి నిదర్శనంగా నిలుస్తున్నది.
-ప్రశాంత్ తాప్సీ, మెహెతా ఈక్విటీస్ లిమిటెడ్ సీనియర్ వీపీ

బీఎస్ఈలో టాప్-5 కంపెనీలుమార్కెట్ విలువ (రూ.కోట్లలో)
రిలయన్స్ ఇండస్ట్రీస్ బీ 19,82,265.88
టీసీఎస్ బీ 15,50,820.85
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బీ 13,16,818.45
భారతీ ఎయిర్‌టెల్ బీ 9,67,295.41
ఐసీఐసీఐ బ్యాంక్ బీ 8,98,320.22
గత నెల 24న తొలిసారి 85వేల మార్కును తాకిన సెన్సెక్స్
2023లో 11,399.52 పాయింట్లు (18.73 శాతం) ఎగిసిన సెన్సెక్స్‌బీఎస్ఈ మదుపరుల సంపద గత ఏడాది నవంబర్ 29న ఈ ఏడాది మే 21న మొదటిసారి 5 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. 6 నెలల్లోపే లక్ష కోట్ల డాలర్లు పెరిగింది.
నిరుడు రూ.81.90 లక్షల కోట్లు పెరిగిన బీఎస్ఈ నమోదితసంస్థల మార్కెట్ విలువ

## బంగారం ప్రియులకు బ్యాడ్ న్యూస్.. మళ్లీ పెరిగాయ్




న్యూఢిల్లీ-నవభూమి:బంగారం ప్రియులకు బ్యాడ్ న్యూస్. గత కొంత కాలంగా స్వల్ప హెచ్చుతగ్గులకు లోనవుతున్న పసిడి ధరలు గురువారం మళ్లీ పెరిగాయి. తులం బంగారం రూ.500 పెరిగింది. తెలుగు రాష్ట్రాలు సహా, దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే..
హైదరాబాద్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.71,010 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.76,890 ఉంది.
విజయవాడలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.71,010 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.76,890 గా ఉంది.
చెన్నైలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 71,010 ఉండగా, 24 క్యారెట్ల ధర రూ.77,460
కేరళలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.71,010 ఉండగా, 24 క్యారెట్ల ధర రూ.77,460
బెంగళూరులో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.71,010 ఉండగా, 24 క్యారెట్ల ధర రూ.77,460
ముంబయిలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.71,010 ఉండగా, 24 క్యారెట్ల ధర రూ.77,460
ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.71,160, ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.77,610
స్వల్పంగా తగ్గిన వెండి ధరలు..
బంగారం ధరలు స్వల్పంగా పెరిగితే.. వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.94 వేల 900 వద్ద ఉంది. పైన చెప్పిన ధరల్లో జీఎస్టీ, టీసీఎస్ వంటివి కలిపి ఉండవు. మీరు కొనుగోలు చేసిన తర్వాత వేరేగా చెల్లించాల్సి ఉంటుందనే విషయం గుర్తుంచుకోవాలి.

## మస్క్ చేతిలో ఎక్స్ విలువ భారీగా పతనం.. ఎంతంటే..



న్యూఢిల్లీ-నవభూమి:ఎక్స్(ట్విటర్) విలువ రెండేళ్ల క్రితం ఎలాన్ మస్క్ కొనుగోలు చేసిన సమయంతో పోలిస్తే, ఏకంగా 80 శాతం తగ్గిందని పెట్టుబడుల దిగ్గజ సంస్థ ఫెడెలిటీ తెలిపింది. మస్క్ యాజమాన్యంలో కంపెనీ ఆర్థిక పనితీరు, భవితవ్యంపై తలెత్తిన ఆందోళనలే ఇందుకు కారణమని వెల్లడించింది. 2022 అక్టోబర్‌లో ట్విటర్‌ను మస్క్ 44 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేశారు. భారతీయ కరెన్సీలో 3.7 లక్షల కోట్లన్నమాట. ఆ తర్వాత ఎక్స్ఛేంజీల్లో ఎక్స్ షేరు ట్రేడ్ కాకపోయినప్పటికీ, ఫెడెలిటీ మాత్రం ఎక్స్‌లో తనకున్న షేర్ల విలువను వెల్లడిస్తోంది.తాజా నివేదిక ప్రకారం.. ఫెడిలిటీకి ఎక్స్‌లో ఉన్న షేర్ల విలువ 2022 అక్టోబరులో 19.66 మిలియన్ డాలర్లు కాగా, 2024 ఆగస్టు చివరకు 4.2 మి. డాలర్లకు పతనమైంది. అంటే 79 శాతం క్షీణించిందన్నమాట. వీటి ప్రకారం ఎక్స్ మొత్తం విలువ 9.4 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.78 వేల కోట్లే అవుతుంది. మస్క్ కొనుగోలు చేసినప్పటి విలువతో పోలిస్తే ఇది చాలా తక్కువ కావడం గమనార్హం.
అంగీకరించని విశ్లేషకులు..ఎలాన్ మస్క్‌కు చెందిన ఎక్స్ విలువ తగ్గిందని ఫెడెలిటీ వేసిన అంచనాలను కొందరు విశ్లేషకులు అంగీకరించట్లేదు. దీర్ఘకాలంలో మస్క్ చెల్లించిన విలువ కంటే ఎక్కువ విలువకు ఎక్స్ చేరుకుంటుందని వారు అంటున్నారు. ప్రస్తుతం ఎక్స్ 15 బిలియన్ డాలర్లకు చేరి ఉండొచ్చని వెడిబుల్ సెక్యూరిటీస్ ఎండీ డాన్ ఐవెస్ అన్నారు. వినియోగదారులను ఆకర్షించడంలో ఎక్స్ సఫలమైందని.. అయితే ఎక్స్.. ప్రస్తుతం కొన్ని ఒడుదొడుకులు ఎదుర్కొంటోందని తెలిపారు. ఈ సోషల్ మీడియా ప్లాట్‌ఫాం కేవలం 4 శాతం 'బ్రాండ్ సేఫ్టీ'నే అందిస్తోందని.. గూగుల్ ఇచ్చే 39 శాతంతో పోలిస్తే ఇది చాలా తక్కువ అని ప్రకటనదారులు భావిస్తున్నారు. వచ్చే ఏడాది ఎక్స్‌లో తమ వ్యయాలు తగ్గించుకోవాలని 26 శాతం మార్కెటర్లు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## ఇన్వెస్టర్లకు ఫిబ్రవరి 1 నుంచి 3 ఇన్ 1 అకౌంట్




న్యూఢిల్లీ-నవభూమి:సెబీ తాజా ఆదేశాల మేరకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 నుంచి స్టాక్ బ్రోకర్లు తమ క్లయింట్లకు సెకండరీ మార్కెట్లో ట్రేడింగ్‌కు యూపీఐ ద్వారా...ఇన్వెస్టర్లకు ఫిబ్రవరి 1 నుంచి 3 ఇన్ 1 అకౌంట్
న్యూఢిల్లీ: సెబీ తాజా ఆదేశాల మేరకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 నుంచి స్టాక్ బ్రోకర్లు తమ క్లయింట్లకు సెకండరీ మార్కెట్లో ట్రేడింగ్‌కు యూపీఐ ద్వారా ఫండ్స్ బ్లాక్ చేసుకునే విధానం లేదా 3 ఇన్ 1 (సేవింగ్స్, డీమ్యాట్, ట్రేడింగ్) అకౌంట్‌ను ఆఫర్ చేయాల్సి ఉంటుంది.

## ఓలా ఎలక్ట్రిక్ బాస్ సీజన్ సేల్ ఆఫర్.. రూ.40 వేల వరకూ డిస్కౌంట్.. ఎస్1 స్కూటర్ రూ.49,999లకే లభ్యం..!




న్యూఢిల్లీ-నవభూమి: ఫెస్టివల్ సీజన్ సందర్భంగా ప్రముఖ ఎలక్ట్రిక్ టూవీలర్స్ తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్‌కస్టమర్లకు బంపరాఫర్ ప్రకటించింది. బాస్ బిగ్గెస్ట్ ఓలా సీజన్ సేల్ -%లో ఆఫర్లు అందిస్తున్నది. ఓలా ఎస్ 1 ఈవీ స్కూటర్‌ను రూ.49,999లకే విక్రయిస్తుంది. దీని ధరపై రూ.40 వేల వరకూ ఆఫర్లు అందుబాటులోకి తెచ్చింది. అందులో రూ.25 వేల వరకూ క్యాష్ డిస్కౌంట్ ఆఫర్ చేసింది. డిస్కౌంట్లతోపాటు సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్, హైపర్ చార్జింగ్ క్రెడిట్స్, మూవ్ ఓఎస్ం అప్‌గ్రేడ్ తదితర మార్గాల్లో రూ.40 వేల వరకూ రాయితీ అందిస్తోంది.
-%బాస్ బిగ్గెస్ట్ ఓలా సీజన్ సేల్ సేల్‌లో భాగంగా రెండు కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ గల ఓలా ఎస్ 1 ఎక్స్ స్కూటర్ కేవలం రూ.49,999లకే సొంతం చేసుకోవచ్చు. అయితే ఇది లిమిటెడ్ ఆఫర్ మాత్రమే. ఎస్1 స్కూటర్‌పై రూ.25 వేలు క్యాష్ డిస్కౌంట్, రూ.15 వేలు ఇతర డిస్కౌంట్లు లభిస్తాయి. 8 ఏండ్లు లేదా 80 వేల కిలోమీటర్ల వరకూ రూ.7000 విలువైన బ్యాటరీ వారంటీ ఫ్రీగా ఇస్తోంది ఓలా ఎలక్ట్రిక్. మూవ్ ఓఎస్ ం అప్‌గ్రేడ్ కింద రూ.6000, హైపర్ చార్జింగ్ క్రెడిట్స్ రూపంలో రూ.6000తోపాటు సెలెక్టెడ్ క్రెడిట్ కార్డులతో ఈఎంఐల ద్వారా కొనుగోలు చేసే వారికి రూ.5000 వరకూ ఫైనాన్స్ ఆఫర్ అందుబాటులోకి తెచ్చింది.
ఓలా ఎలక్ట్రిక్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ భవిష్ అగర్వాల్ ఈ సందర్భంగా స్పందిస్తూ.. %-%పండుగల సీజన్ సందర్భంగా మా కస్టమర్లకు ఆఫర్లు అందించేందుకు బాస్ తెచ్చినందుకు ఆనందంగా ఉన్నాం. ఐసీఈ ఏజ్ వెహికల్స్‌కు స్వస్తి పలికి ఈవీ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడమే మా మిషన్. అందుకోసం అతిపెద్ద డిస్కౌంట్లు, బెస్ట్ డీల్స్, ఆకర్షణీయ ఆఫర్లతో ఈవీ స్కూటర్లు కొనుగోలు చేసేందుకు కస్టమర్లకు వెసులుబాటు కల్పిస్తున్నాం- అని చెప్పారు.
ఓలా ఎలక్ట్రిక్ తన ఎస్1 పోర్ట్‌ఫోలియో స్కూటర్లపై ఆరు ఆకర్షణీయ ఆఫర్లు అందిస్తున్నది. ఎస్1 ప్రో, ఎస్1 ఎయిర్ స్కూటర్ల ధరలు రూ.1,34,999, రూ.1,07,499. కాగా, ఎస్1ఎక్స్ రెండో కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ స్కూటర్ రూ.74,999, మూడు కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ స్కూటర్ రూ.87,999, 4 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ స్కూటర్ రూ.1,01,999 లభిస్తాయి.

## పశ్చిమాసియాలో యుద్ధ భయాలు.. స్టాక్ మార్కెట్లు క్రాష్.. రూ.11లక్షల కోట్ల సంపద ఆవిరి..



న్యూఢిల్లీ-నవభూమి:దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితులు దేశీయ మార్కెట్లపై ప్రభావం పడింది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి చేయడంతో యుద్ధ వాతావరణ నెల కొన్నది. ఈ క్రమంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించడంతో మార్కెట్లు నష్టాల్లో ఊభిలోకి జారుకున్నాయి. సెన్సెక్స్, నిఫ్టీ రెండుశాతానికిపైగా పడిపోగా.. దాదాపు రూ.11లక్షలకోట్లకుపైగా మదుపరుల సంపద ఆవిరైంది. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు ముడి చమురు ధరలు పెరిగాయి. ఇక బీఎస్ఈలో లిస్ట్ అయిన అన్ని కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.63లక్షల కోట్లు తగ్గి రూ.469 కోట్లకు పడిపోయింది. కిత్రం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,002.09 మొదలైంది. మొదట్లోనే 1,250 పాయింట్లకుపైగా నష్టాల్లో ట్రేడింగ్ మొదలైంది. ఆ తర్వాత మార్కెట్లు ఏ దశలోనూ కోలుకోలేదు. ఇంట్రాడేలో 82,434.02 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది.
చివరకు 1,769.19 పాయింట్ల నష్టంతో 82,497.10 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 546.80 పాయింట్లు పతనమై.. 25,250.10 వద్ద ముగిసింది. ఇటీవల వరుస లాభాలతో స్టాక్ మార్కెట్లు కొత్త రికార్డులను సృష్టిస్తూ వచ్చాయి. దాదాపు రెండు నెలల అనంతరం పతనమ్యాయి. ట్రేడింగ్‌లో దాదాపు 1,077 షేర్లు పురోగమించగా.. 2740 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో అత్యధికంగా నష్టపోయిన వాటిలో బీపీసీఎల్, ఎల్ అండ్ టీ, టాటా మోటార్స్, శ్రీరామ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్ ఉన్నాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఓఎన్‌జీసీ లాభపడ్డాయి. అన్ని రంగాల సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. రియాల్టీ 4.5 శాతం, ఆటో, బ్యాంక్, మీడియా, క్యాపిటల్ గూడ్స్, ఆయిల్, గ్యాస్ ఇండెక్స్ 2నుంచి 3శాతం చొప్పున నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 2శాతం చొప్పున పతనమయ్యాయి.

## గూగుల్ పే నుంచి క్షణాల్లోనే రూ. 50 లక్షల లోన్స్




న్యూఢిల్లీ-నవభూమి:మన దేశంలో చాలా మంది వ్యక్తులకు ఏదో ఒక కారణంతో డబ్బు అవసరం అవుతుంది. ఈ క్రమంలో ఎవరికైనా అకస్మాత్తుగా లోన్స్ అవసరం అయితే ఇటీవల కాలంలో అనేక మంది లోన్ యాప్స్ కోసం వెతుకుతున్నారు. మరికొంత మంది మాత్రం బ్యాంకు నుంచి రుణం పొందడానికి ఆసక్తి చూపిస్తున్నారు. బ్యాంక్ నుంచి లోన్ పొందాలంటే కనీసం 7 నుంచి 10 రోజుల వరకు పడుతుంది.కానీ త్వరగా లోన్స్ ఇచ్చేందుకు ఇప్పుడు కూడా సిద్ధమైంది. మీరు ఇంట్లోనే కూర్చుని యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో లోన్స్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అంతేకాదు మీరు ఏకంగా రూ. 50 లక్షల వరకు గూగుల్ పే నుంచి గోల్డ్ లోన్స్ తీసుకునే ఛాన్స్ ఉంది. అందుకోసం ముత్తూట్ ఫైనాన్స్ సంస్థతో డీల్ కుదుర్చుకున్నారు. ఇక పర్సనల్ లోన్స్ అయితే రూ. 5 లక్షల వరకు పొందవచ్చు.
అయితే పర్సనల్ లోన్ తీసుకోవడానికి ఎలాంటి అర్హతలు ఉండాలి, అవసరమైన పత్రాలు ఏంటి, దరఖాస్తు ప్రక్రియ ఎలా అనే సమాచారాన్ని ఇక్కడ తెలుసుకుందాం. ఎవరైనా నుంచి పర్సనల్ లోన్ కోసం అప్లై చేయాలనుకుంటే తప్పనిసరిగా కింది అర్హతలను కల్గి ఉండాలి.
ముందుగా, మీరు Google Pay UPI IDని కలిగి ఉండాలి
ఈ లోన్ కోసం దరఖాస్తు చేసుకునే వ్యక్తికి కనీస వయస్సు 21 సంవత్సరాలు, గరిష్ట వయస్సు 57 సంవత్సరాలు ఉండటం తప్పనిసరి
పర్సనల్ లోన్ కోసం దరఖాస్తు చేసుకునే వ్యక్తి %జ×దీ×యా% స్కోర్ కనీసం 600 ఉండాలి
మీరు మరే ఇతర బ్యాంక్ ద్వారా డిఫాల్ట్‌గా ప్రకటించబడి ఉండకూడదు
పర్సనల్ లోన్ కోసం అవసరమైన పత్రాలు
1. ఆధార్ కార్డ్
2. పాన్ కార్డ్
3. ఆదాయ ధృవీకరణ పత్రం
4. మొబైల్ నంబర్
5. ఇ-మెయిల్
6. గత 4 నెలల బ్యాంక్ స్టేట్‌మెంట్
7. పాస్‌పోర్ట్ సైజు ఫోటో
Google Pay పర్సనల్ లోన్ కోసం ఆన్‌లైన్‌లో ఎలా దరఖాస్తు చేయాలి?
మీరు ముందుగా Google Pay యాప్‌ను ప్లే స్టోర్ నుంచి ఇన్‌స్టాల్ చేయాలి
ఆ తర్వాత మీ ఫోన్ నంబర్ వంటి వివరాలను నమోదు చేయాలి
ఆ క్రమంలో జీపేలో బిజినెస్ ఫీచర్‌ను ఓపెన్ చేయాలి
తర్వాత దానిని క్రిందకు స్క్రోల్ చేస్తే మీకు ఫైనాన్స్ ఫీచర్ కనిపిస్తుంది
ఫైనాన్స్ ఫీచర్లో మీకు అనేక రకాల లోన్స్ యాప్స్ అందుబాటులో ఉంటాయి
వాటిలో మీకు నచ్చిన దానిని ఎంపిక చేసుకుని లోన్ కోసం దరఖాస్తు చేయవచ్చు
ఆ క్రమంలో మీ వివరాలను నమోదు చేసిన తర్వాత మీ అర్హతను బట్టి లోన్ ఇస్తారు
మీ సిబిల్ స్కోర్ తక్కువగా ఉంటే మీ లోన్ రిజెక్ట్ అయ్యే ఛాన్స్ ఉంటుంది
మీరు ఏదైనా ఇతర బ్యాంక్ నుంచి లోన్ తీసుకున్నట్లయితే ఆ రుణాన్ని తిరిగి చెల్లించే వరకు Google Pay ద్వారా మీకు లోన్ వచ్చే ఛాన్స్ తక్కువ

## రియల్టీలోకి రూ.9,660 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ-నవభూమి: భారత రియల్టీ రంగం పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తోంది. సెప్టెంబరు త్రైమాసికంలో ఈ రంగం 115 కోట్ల డాలర్ల (రూ.9960 కోట్లు) విలువైన పెట్టుబడులు ఆకర్షించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 45 శాతం ఎక్కువని కొలియర్స్ ఇండియా తెలిపింది. ఈ త్రైమాసికంలో రియల్టీలోకి వచ్చిన పెట్టుబడుల్లో 57 శాతం ముంబై, చెన్నై నగరాలు ఆకర్షించాయి. ఈ త్రైమాసికంలో కార్యాలయాల నిర్మాణ రంగం 61.63 కోట్ల డాలర్ల పెట్టుబడులను ఆకర్షించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది దాదాపు ఏడు రెట్లు ఎక్కువ. నివాస గృహాల విభాగంలోకి వచ్చే పెట్టుబడులు 40 శాతం పెరిగి 38.48 కోట్ల డాలర్లకు చేరాయి. అయితే ఇదే సమయంలో పారిశ్రామిక, గిడ్డంగుల నిర్మాణ రంగంలో మాత్రం పెట్టుబడులు 72 శాతం పడిపోయినట్టు కొలియర్స్ ఇండియా తెలిపింది.
హైదరాబాద్‌లో తగ్గిన ఆఫీస్ స్పేస్ డిమాండ్
సెప్టెంబరు త్రైమాసికంలో హైదరాబాద్‌లో కార్యాలయ స్థలాలకు డిమాండు తగ్గింది. గత ఏడాది జూలై-సెప్టెంబరు మధ్య కాలంలో హైదరాబాద్, చుట్టు పక్క ల ప్రాంతాల్లో 27 లక్షల ఎస్ఎఫ్‌టీ లీజు ఒప్పందాలు నమోదైతే, ఈ సంవత్సరం మూడో త్రైమాసికంలో అది 12.6 లక్షల ఎస్ఎఫ్‌టీకి పడిపోయింది. ఇదే సమయంలో బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, పుణె, ముంబై వంటి నగరాల్లో మాత్రం ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాలు జోరందుకున్నట్టు జేఎల్ఎల్ ఇండియా తెలిపింది. హైదరాబాద్ సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో మూడో త్రైమాసికంలో 121.6 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీసు స్పేస్ లీజు ఒప్పందాలు జరిగాయి.





## ఆ ముగ్గురు మంత్రుల భేటీ వెనుక ఉన్న మతలబు ఏమిటో...

**న్యూఢిల్లీ-నవభూమి:** ముడా వివాదంలో సీఎం సిద్ధరామయ్యకు కేసుల కష్టాలు బిగుసుకుంటున్న తరుణంలో మంత్రుల రహస్యభేటీ కాంగ్రెస్‌లో కలకలం రేపుతోంది. కారణాలు ఏవైనా రహస్యంగా సమావేశం కావడం పలువురు మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులను విస్మయం కలిగిస్తోంది. బీజేపీ-జేడీఎస్ నాయకులు ముఖ్యమంత్రితోపాటు కాంగ్రెస్ పార్టీకి తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నా వాటి గురించి ఒకరిద్దరు తప్ప మంత్రులెవరూ నోరు మెదపడం లేదు. మరోవైపు రహస్య సమావేశాల వెనుక భారీ అజెండానే ఉన్నట్టు తెలుస్తోంది. తాజాగా మంగళవారం రాత్రి హోం మంత్రి పరమేశ్వర్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప, ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్ జార్కిహొళిలు భేటీ అయ్యారు.వీరు ప్రస్తుతం కేబినెట్‌లో కీలకమైన మంత్రులు. ఇప్పటికే పరమేశ్వర్ తాను సీఎం రేసులో ఉన్నానని దాదాపు నిరూపించుకున్నారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీతో ప్రత్యేక సమావేశం కావడం, సదరు విషయాలను బహిరంగంగా చెప్పలేనంటూ ప్రకటించారు. మరోవైపు సతీశ్‌జార్కిహొళి ఆగస్టు రెండోవారం తర్వాత నుంచి సెప్టెంబరు రెండోవారం దాకా నాలుగైదుసార్లు ఢిల్లీకి వెళ్లొచ్చారు. ప్రతిసారి పరమేశ్వర్‌తో చర్చలు జరిపాకనే జార్కిహొళి ఢిల్లీ వెళ్లి వచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల హోం మంత్రి పరమేశ్వర్, డీసీఎం డీకే శివకుమార్ )లు ప్రత్యేకంగా భేటీ అయిన విషయం మరువకముందే ముగ్గురు మంత్రుల కలయిక కాంగ్రెస్‌లో కుతూహలం రేకెత్తిస్తోంది.

## గాజా అటాక్‌లో ముగ్గురు హమాస్ టాప్ లీడర్ల హతం




**న్యూఢిల్లీ-నవభూమి:** మూడు నెలల క్రితం జరిగిన దాడిలో ముగ్గురు హమాస్ సీనియర్ నేతలు మరణించినట్లు ఇజ్రాయిల్ మిలిటరీ)ఇవాళ పేర్కొన్నది. గాజాలో జరుగుతున్న పోరులో గత ఏడాది నుంచి పాలస్తీనా ఆపరేటివ్స్‌తో ఇజ్రాయిల్ యుద్ధం సాగిస్తున్నది. వైమానిక దాడిలో హమాస్ ప్రభుత్వ నేత రాహి ముష్తాహ ప్రాణాలు కోల్పోయినట్లు మిలిటరీ తెలిపింది. హమాస్ పొలిటికల్ బ్యూరోలో సెక్యూర్టీ హోదాలో ఉన్న సమేహ్ అల్ సిరాజ్ కూడామృతిచెందినట్లుతెలిపారు. కమాండర్ సామి ఖుదె కూడా ఆ దాడుల్లో మృతిచెందాడు. హమాస్‌లో ముష్తాహ్ .. సీనియర్ ఆపరేటివ్‌గా ఉన్నాడు. హమాస్ ఫోర్స్‌కు చెందిన నిర్ణయాలను ఆయనే తీసుకునేవారు. హమాస్ టాప్ లీడర్ యాహ సిన్వార్‌కు రైట్ హ్యాండ్‌గా ముష్తాహ్‌ను గుర్తించారు. 2015 నుంచి ముష్తాహ్‌ను గ్లోబల్ ఉగ్రవాదిగా అమెరికా పరిగణించింది. హమాస్ పోలిట్‌బ్యూరో సభ్యుడిగా సిరాజ్, అంతర్గత సెక్యూర్టీ ఏజెన్సీ నేతగా ఓదేహ్ ఉన్నట్లు ఈసీఎఫ్‌ఆర్ పేర్కొన్నది.

## చెత్తలో దొరికిన పెయింటింగ్.. ఆ కుటుంబానికి అదృష్టం తీసుకొచ్చింది



**న్యూఢిల్లీ-నవభూమి:** వాడి పారేసిన వస్తువులను కొనే జంక్ డీలర్‌కు దొరికిన పెయింటింగ్ ఆయన కుటుంబానికి అదృష్టం తీసుకొచ్చింది. ఇటలీలోని జంక్ డీలర్ రోస్సో 1962లో కాప్రిలో ఉన్న ఓ ఇంటిని శుభ్రం చేస్తుండగా ఓ పెయింటింగ్ దొరికింది. దాని మీద పాబ్లో పికాసో సంతకం కూడా ఉంది.దానిని ఆయన పాంపెయిలోని తన ఇంటికి తీసుకెళ్లి, గోడకు తగిలించాడు. దీని గురించి అధ్యయనం చేయగా ఇది పికాసో గీసిన చిత్రమని జంక్ డీలర్ కుమారుడు ఆండ్రియో గుర్తించాడు. అయితే ఈ పెయింటింగ్ పికాసో చిత్రీకరించినదేనని పికాసో ఆథెంటికేటర్స్ ఇంకా నిర్ధారించలేదు. నిర్ధారిస్తే దీని విలువ రూ. 54.58 కోట్లు ఉంటుంది.

## ఇజ్రాయెల్-హెజ్బొల్లా భీకర పోరు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇజ్రాయెల్ దళాలు -హెజ్బొల్లా మధ్య పోరు తీవ్రమైంది. హెజ్బొల్లా లక్ష్యంగా లెబనాన్‌పై గత కొన్ని రోజులుగా గగనతల దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ ఇప్పుడు భూతల దాడులను ప్రారంభించింది. లెబనాన్ భూభాగంలోకి చేరుకొని హెజ్బొల్లాపై దాడి చేస్తున్నది. దీంతో ఇజ్రాయెల్ హెజ్బొల్లా బలగాలు ముఖాముఖి తలపడుతున్నాయి. లెబనాన్‌లోని క్ఫర్ కిలా గ్రామంలో ఇజ్రాయెల్ సైనికులు మకాం వేసిన ఓ భవనాన్ని పేల్చేశామని హెజ్బొల్లా ప్రకటించింది.ఈ దాడిలో ఎనిమిది మంది ఇజ్రాయెల్ సైనికులు మరణించారు. హెజ్బొల్లాతో పోరులో సైనికులను కోల్పోవడం ఇజ్రాయెల్‌కు ఇదే మొదటిసారి. ఒడైస్సె, యరౌన్ ప్రాంతాల్లోనూ ఇజ్రాయెల్ బలగాలపై దాడులు చేసి, నష్టం కలిగించామని హెజ్బొల్లా తెలిపింది. దీంతో ఈ ప్రాంతాలను సైతం ఇజ్రాయెల్ సైనికులు వదిలి వెనక్కు వెళ్లిపోయినట్టు పేర్కొన్నది. సరిహద్దులో ఇజ్రాయెల్ సైనిక శిబిరాలే లక్ష్యంగా 100 రాకెట్లతో దాడి చేసినట్టు హెజ్బొల్లా మీడియా అధికారి మొహమ్మద్ అఫీఫ్ ప్రకటించారు.

**సరిహద్దుకు భారీగా ఇజ్రాయెల్ దళాలు**

హెజ్బొల్లాపై పోరును మరింత తీవ్రం చేసే లక్ష్యంతో లెబనాన్ సరిహద్దుకు దాదాపు 10 వేల మంది సైన్యాన్ని తరలించాలని ఇజ్రాయెల్ నిర్ణయించింది. సరిహద్దుల్లో దాడులు తీవ్రతరం చేయనున్న నేపథ్యంలో దక్షిణ లెబనాన్ సరిహద్దున ఉన్న మరో 24 గ్రామాల ప్రజలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సిందిగా ఇజ్రాయెల్ మిలిటరీ హెచ్చరించింది. లెబనాన్‌పై గగనతల దాడులను ఇజ్రాయెల్ కొనసాగిస్తున్నది. తూర్పు లెబనాన్‌లోని బెకా వ్యాలీపై బుధవారం దాడి చేసింది. దక్షిణ బీరుట్‌లోనూ ఇజ్రాయెల్ ఐదు పేలుళ్లు జరిపింది.

**గాజాపై మరోసారి ఇజ్రాయెల్ దాడి**

కొన్ని రోజులుగా గాజా స్ట్రిప్‌పై దాడులకు విరామం ఇచ్చిన ఇజ్రాయెల్ మంగళవారం రాత్రి నుంచి మరోసారి బాంబుల వర్షం కురిపిస్తున్నది. గాజాలోని ఖాన్ యూనిస్ నగరంపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 12 మంది పిల్లలు, ఏడుగురు మహిళలు సహా 51 మంది మరణించారు. సహాయక శిబిరాలపై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడిందని పాలస్తీనా వర్గాలు ఆరోపించాయి. కాగా, సిరియా రాజధాని డమాస్కస్‌పైనా ఇజ్రాయెల్ దాడి చేసింది. పశ్చిమ డమాస్కస్‌పై ఇజ్రాయెల్ దాడుల్లో ముగ్గురు మరణించారు.

## మంత్రి వ్యాఖ్యలు అవమానకరం: చిరంజీవి

**హైదరాబాద్-నవభూమి:** మంచి చేస్తారని మేం నాయకులను ఎన్నుకుంటున్నాం. కానీ మహిళలపై ఇలాంటి ఆరోపణలు చేసి దిగజారవద్దు. రాజకీయ నాయకులు, గౌరవప్రదమైన స్థానాల్లో ఉన్నవారు అందరికీ స్ఫూర్తిగా నిలవాలి" అని చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు.

# ఆ వివాదాస్పద ఐఏఎస్ అధికారికి జైలుశిక్ష!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ ప్రభుత్వ హయాంలో కీలక పాత్ర పోషించిన అధికారుల్లో ప్రవీణ్ ప్రకాశ్ ఒకరు. 2019లో వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే ఈయన ముఖ్యమంత్రి కార్యాలయంలో కీలక పాత్ర పోషించారు. నాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎల్వీ ప్రసాద్ ను బదిలీ చేస్తూ ఆయన కంటే ఎంతో జూనియర్ అయిన ప్రవీణ్ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేయడం తీవ్ర వివాదాస్పదమైంది. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సీఎం కార్యాలయంలో కీలక పాత్ర పోషించిన ప్రవీణ్ ప్రకాశ్ ఆ తర్వాత ఢిల్లీలోని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ గానూ వ్యవహరించారు. అక్కడి నుంచి మళ్లీ ఆంధ్రప్రదేశ్ కు తిరిగొచ్చి ఏపీ పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో పాఠశాల విద్యా శాఖలో ప్రవీణ్ ప్రకాశ్ తీసుకున్న నిర్ణయాలు, చర్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. క్షేత్ర స్థాయి పర్యటనల పేరుతో ఆయా ప్రభుత్వ స్కూళ్లకు వెళ్లిన ఆయన జెడ్పీ స్కూళ్లు ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ స్కూళ్ల టీచర్లపై మండిపడిన సందర్భాలున్నాయని అంటున్నారు. చివరకు జిల్లా కలెక్టర్లకు కూడా ప్రవీణ్ ప్రకాశ్ ఆదేశాలు జారీ చేసేవారని.. వారిపైనా అజమాయిషీ చెలాయించాలని చూసేవారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రవీణ్ ప్రకాశ్ ను పక్కనపెట్టింది. ఆయనకు ఏ పదవీ అప్పగించలేదు. దీంతో ఆయన స్వచ్ఛంధ పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ప్రభుత్వం ఆయన వీఆర్ఎస్ ను ఆమోదించింది. కాగా వైసీపీ ప్రభుత్వ హయాంలో కోర్టు ధిక్కరణ కేసుకు సంబంధించి నాటి పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ కు, అప్పటి ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి శేషగిరి బాబుకు హైకోర్టు తాజాగా జైలుశిక్షతోపాటు జరిమానా విధించింది. తామిచ్చిన ఉత్తర్వులు అమలు చేయకపోవడం పట్ల కోర్టు వారిద్దరిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులు.. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని భావిస్తే వాటిపై అప్పీల్ చేసే వెసులుబాటు వారికి ఉందని హైకోర్టు తెలిపింది. అయితే తామిచ్చిన ఉత్తర్వులకు వక్రభాష్యం చెబుతూ వాటిని అమలు చేయకుండా ఉండడానికి వీల్లేదని వెల్లడించింది. ప్రస్తుత కేసులో కోర్టు ఉత్తర్వులు అమలు చేయని పాఠశాల విద్యాశాఖ అప్పటి ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, ఇంటర్మీడియెట్ బోర్డు అప్పటి కార్యదర్శి శేషగిరిబాబుకు నెలరోజుల సాధారణ జైలుశిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించింది. అయితే, అప్పీల్ చేసుకునేందుకు వీలుగా సమయం ఇవ్వాలని ప్రవీణ్ ప్రకాశ్, శేషగిరిబాబు విన్నవించడంతో తీర్పు అమలును నాలుగు వారాల పాటు హైకోర్టు నిలిపివేసింది. తాము ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీల్ కోర్టు ఎలాంటి స్టే ఇవ్వకపోతే ఈ నెల 21న హైకోర్టు రిజిస్ట్రార్ జ్యుడీషియల్ ముందు లొంగిపోవాలని వారిద్దరినీ కోర్టు ఆదేశించింది. ఇంతకూ ప్రవీణ్ ప్రకాశ్, శేషగిరిబాబుపై ఉన్న వివాదం ఏమిటంటే.. ఇంటర్మీడియెట్ బోర్డులో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విజయలక్ష్మి పనిచేసేవారు. ఈ క్రమంలో ఆమె 2022 ఆగస్టు 31 రిటైర్ అయ్యారు. అదే ఏడాది జనవరి 31న పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఆర్థిక శాఖ జీవో 15ను జారీ చేసింది. ఈ జీవో ఆధారంగా తనను 62 ఏళ్లు వచ్చేవరకు ఉద్యోగంలో కొనసాగించాలని విజయలక్ష్మి ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు. అయితే ఉన్నతాధికారులు తనకు అనుకూలంగా స్పందించకపోవడంతో విజయలక్ష్మి 2023లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి.. విజయలక్ష్మికి 62 ఏళ్లు వచ్చేవరకు సర్వీసులో కొనసాగించాలని ఆదేశిస్తూ.. 2023 ఫిబ్రవరిలో ఉత్తర్వులు ఇచ్చారు. అయినా కోర్టు ఆదేశాలను అధికారులు అమలు చేయలేదు. దీంతో విజయలక్ష్మి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. అప్పటి పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి శేషగిరిబాబును ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి.. కోర్టు ఉత్తర్వులను అమలు చేయనందుకు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రవీణ్ ప్రకాశ్, శేషగిరిబాబుకు జైలుశిక్ష, జరిమానా విధించారు.

## ఆ సిటీలో ఫ్లిప్ కార్ట్ వారి రూపాయికే ఆటో రైడ్..





**బెంగళూరు-నవభూమి:** ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్ కార్ట్ వినూత్న రీతిలో ఒక ఆఫర్ ను ప్రకటించింది. అదేమంటే.. రూపాయి అంటే ఒక్క రూపాయితోనే ఆటో రైడ్ ను ఏర్పాటు చేసింది. అయితే.. ఈ ఊరించే ఆఫర్ కేవలం గార్డెన్ సిటీ అదేనండి బెంగళూరు వరకు మాత్రమే పరిమితం కావటం గమనార్హం. ఒక రూపాయికే ఆటో రైడ్ ఉచితమన్న మాటతో ఆటోల్లో ప్రయాణించేందుకు పెద్ద ఎత్తున ఆసక్తి చూపించారు. దీంతో.. బెంగళూరు రోడ్ల మీద సందడి వాతావరణం నెలకొంది. అయితే.. ఈ ఆఫర్ ను వినియోగించుకోవాలంటే కచ్చితంగా బెంగళూరు వాసులే అయి ఉండాలన్న కండీషన్ పెట్టారు. ఈ ఆఫర్ నేపథ్యంలో స్థానిక ఆటో డ్రైవర్లతో కలిసి టెక్ క్యాపిటల్ లో ప్రచారాన్ని ప్రారంభించారు. యూపీఐ చెల్లింపుల్ని ప్రోత్సహించటానికి వీలుగా ఈ ఆఫర్ ను తెర మీదకు తీసుకొచ్చారు. బిగ్ బిలియన్ డేస్ సేల్ మరింత ఉత్సాహాన్ని నింపేందుకు కూడా రూపాయి ఆటో రైడ్ ఆఫర్ ను ప్రకటించినట్లుగా చెబుతున్నారు. రూపాయికే ఆటో రైడ్ కావటంపై బెంగళూరు వాసులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా ఫ్లిప్ కార్ట్ కు థ్యాంక్స్ చెబుతున్నారు. అంతా బాగుంది కానీ.. ఒక్కటే అభ్యంతరం. దేశ వ్యాప్తంగా అన్ని చోట్ల ఫ్లిప్ కార్ట్ వ్యాపారం చేస్తున్నప్పుడు.. ఇలాంటి బంఫర్ ఆఫర్ ఒక్క బెంగళూరు సిటీకే పరిమితం చేయటం ఏమిటి? మిగిలిన నగరాల్లో కొన్నింటికైనా ఈ ఆఫర్ ను ప్రకటించొచ్చు కదా? అన్న మాట వినిపిస్తోంది. నిజమే కదా? ఆ వాదనలో న్యాయం ఉంది కదా?

## జైళ్లలో కుల వివక్షపై సుప్రీం కోర్టు చారిత్రక తీర్పు



**న్యూఢిల్లీ-నవభూమి:** జైలు మాన్యువల్స్‌లో క్యాస్ట్ కాలమ్‌ను తొలగించాలని కేంద్రం, రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. చిన్న కులాల ఖైదీలతో మరుగుదొడ్లు కడిగించడం వంటి స్కావెంజింగ్ పనులు, అగ్ర కులాల వారికి వంట పనుల కేటాయింపు వివక్షే అవుతుందని ధర్మాసనం స్పష్టం చేసింది. జైళ్లలో కుల ఆధారిత వివక్ష, విభజన ఉందని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై గురువారం విచారించిన కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి చర్యలు అంటరానితనం కిందకే వస్తాయని పేర్కొంది. కులం ఆధారంగా ఖైదీలను వేరుగా ఉంచడం మార్పు తీసుకురాదని, వారి ఆత్మగౌరవానికి భంగం కలిగించడం వలసవాద వ్యవస్థకు చిహ్నమని వెల్లడించింది."కొన్ని రాష్ట్రాల్లో కులం ఆధారంగా ఖైదీలకు పనులను అప్పగిస్తున్నారు. జైలులో గదుల కేటాయింపునకు సంబంధించిన నిబంధనలు సరికావు. షెడ్యూల్డ్ కులాల ఖైదీలకే క్లీనింగ్ పనులు అప్పగించడం విస్మయం కలిగిస్తోంది. కింది కులాల ఖైదీలకు మాత్రమే శుభ్రపరిచే పని, అగ్రవర్ణ ఖైదీలకు వంట పనులు ఇవ్వడం ఆర్టికల్ 15ను ఉల్లంఘించడమే. అభ్యంతరకరంగా ఉన్న నిబంధనలను అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు మూడు నెలల్లో మార్చాలి. ఈ నిర్ణయం అమలుకు సంబంధించిన నివేదికను కూడా కోర్టులో సమర్పించాలి" అని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది.ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఖైదీలపై వివక్షకు కులం కారణం కారాదని, అలాంటి వాటిని అనుమతించేది లేదని తెలిపింది. పని విషయంలో అందరికీ సమాన హక్కు కల్పించాలని వివరించింది. ప్రమాదకరంగా ఉన్న మురుగునీటి ట్యాంకులను శుభ్రం చేసే పనులకు ఖైదీలను అనుమతించకూడదని సూచించింది. ఒక కులం వారినే స్వీపర్లుగా ఎంపిక చేయటం సమానత్వ హక్కుకు వ్యతిరేకమని వివరించింది.

# హరియాణాలో ఎన్నికల కుస్తీ!



**న్యూఢిల్లీ-నవభూమి:** హరియాణాలో బీజేపీకి ప్రతికూల పవనాలు వీస్తున్నాయా!? పదేళ్లుగా అధికారంలో ఉండడం ఆ పార్టీ, ప్రభుత్వంపై వ్యతిరేకతకు కారణమవుతోందా!? రైతులు, కుస్తీ యోధులు, నిరుద్యోగం, ముఠా తగాదాలు ఇందుకు ఆజ్యం పోస్తున్నాయా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నాయి రాజకీయ వర్గాలు! దైనిక్ భాస్కర్ వంటి హిందీ పత్రికలతోపాటు వివిధ సంస్థలు నిర్వహించిన సర్వేల్లో హరియాణాలో బీజేపీ ఎంత బలంగా పోరాడినా 15-20 సీట్లు దక్కకపోవచ్చునని అంచనా వేస్తున్నాయి. బీజేపీ గట్టి పోటీ ఇస్తోందని చెబుతున్న వారే.. ఆ పార్టీ తప్పనిసరిగా గెలిచే స్థానాలు ఏమిటని అడిగితే కచ్చితంగా చెప్పలేకపోవడం కనిపిస్తోంది. నిజానికి, ఈ ప్రజా వ్యతిరేకతను గమనించే కేంద్ర నాయకత్వం ఆరు నెలల కిందట ముఖ్యమంత్రిని మార్చింది. ఎన్నికల సందర్భంగా సగానికిపైగా సిటింగ్ అభ్యర్థులనూ మార్చేసింది. అయినా, సత్ఫలితాలు రావడం లేదని బీజేపీ నేతలే వాపోతున్నారు. ఈ నేపథ్యంలో, ఓట్ల చీలికపై ఆ పార్టీ ఆశలు పెట్టుకుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక్కడ ఇండి కూటమిలో భాగంగా కాంగ్రెసతో పొత్తును తిరస్కరించి ఆమ్ ఆద్మీ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తోంది. అలాగే, ఐఎన్ఎల్‌డీ-బీఎస్పీ కూటమి, జననాయక్ జనతా పార్టీ- ఆజాద్ సమాజ్ పార్టీ కూటమి సొంతంగా బరిలోకి సొంతంగా బరిలోకి దిగాయి. ఆయా పార్టీలు, కూటములు కాంగ్రెస్ ఓట్లను చీల్చడంపైనే బీజేపీ ఇప్పుడు ఆశలు పెట్టుకుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఒకవేళ, త్రిశంకు అసెంబ్లీ ఏర్పడితే చిన్న పార్టీలు, స్వతంత్రులు కింగ్ మేకర్ పాత్ర పోషించే అవకాశం ఉందని, కేంద్రంలో అధికారంలో ఉండడంతో ఆ పరిణామం తమకు అనుకూలించే అవకాశం ఉందని బీజేపీ నాయకులు విశ్లేషిస్తున్నారు. అయితే, కాంగ్రెస్ వాదన ఇందుకు భిన్నంగా ఉంది. హరియాణాలో ముక్కోణపు పోటీ జరిగే అవకాశాలు ప్రతిసారీ తగ్గిపోతున్నాయని, ప్రజలు తమ ఓటును వృథా చేయడం లేదని కాంగ్రెస్ వర్గాలు వివరిస్తున్నాయి. 2014 ఎన్నికల్లో ముక్కోణపు పోటీ 49 స్థానాల్లో జరిగితే.. 2019 ఎన్నికలకు వచ్చేసరికి వాటి సంఖ్య 28 స్థానాలకు తగ్గిపోయిందని, ఈసారి వాటి సంఖ్య పదిలోపే ఉండవచ్చని విశ్లేషిస్తున్నాయి. హరియాణాలో దేవీలాల్ వారసుల పట్టు రోజురోజుకూ తగ్గిపోవడం కూడా పోటీ ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ మధ్యే పరిమితం కావడానికి కారణమని విశ్లేషిస్తున్నాయి.

## పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు.. యుద్ధం అంచున ప్రపంచం!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఒకవైపు ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రత్యక్ష దాడితో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. మరోవైపు లాంగ్ రేంజ్ క్షిపణుల ప్రయోగిస్తామంటూ ఉక్రెయిన్, అణు విధానం మార్చుకుంటామంటూ రష్యా చేస్తున్న హెచ్చరికలతో ఉక్రెయిన్ రష్యా యుద్ధం మరింత తీవ్రంగా మారుతున్నది. ఇజ్రాయెల్, ఉక్రెయిన్‌కు అమెరికా, నాటో దేశాల మద్దతు, ఇరాన్‌కు రష్యాతో పాటు అమెరికా వ్యతిరేక శక్తుల మద్దతు ఉంటుందనే అభిప్రాయాలు ప్రాంతీయ ఉద్రిక్తతలను ప్రపంచ యుద్ధం దిశగా నడిపిస్తున్నాయి. దీంతో మూడో ప్రపంచ యుద్ధానికి గతంలో ఎన్నడూ లేనంత సమీపానికి ప్రపంచం చేరుకున్నదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

సోషల్ మీడియాలోనూ వరల్డ్ వార్ 3 అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌గా మారింది. మరోవైపు అధ్యక్ష ఎన్నికల వేడి మీదున్న అమెరికాలో ఇది ఎన్నికల అంశంగా మారింది. మూడో ప్రపంచ యుద్ధం అంచుకు చేరుకుంటున్నామని రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.

**ఇక ఇజ్రాయెల్ వర్సెస్ ఇరాన్**

గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై పాలస్తీనా నుంచి హమాస్ జరిపిన దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మొదలయ్యాయి. హమాస్‌కు అండగా లెబనాన్ కేంద్రంగా పని చేసే హెజ్బొల్లా, యెమెన్ నుంచి పని చేసే హౌతీలు, ఇరాక్, సిరియా నుంచి మిలీషియాలు ఇజ్రాయెల్‌పై దాడులు జరుపుతున్నాయి. ఈ అన్ని సంస్థలకూ ఇరాన్ మద్దతు ఉందనేది ఇజ్రాయెల్ ఆరోపణ. ఇంతకాలం హమాస్‌ను ప్రధానంగా లక్ష్యంగా చేసుకొని గాజాపై భారీగా దాడులు చేసిన ఇజ్రాయెల్ ఇప్పుడు హెజ్బొల్లాను లక్ష్యంగా చేసుకుంది.

వందలాది పేజర్ల పేల్చేయడం, హెజ్బొల్లా నేత సయ్యద్ హస్సన్ నస్రల్లాను హతమార్చడం, లెబనాన్‌పై భూతల దాడులు ప్రారంభించడం ద్వారా హెజ్బొల్లాను తుదముట్టించే పనిలో ఇజ్రాయెల్ ఉంది. అయితే, ఇంతకాలం ఇజ్రాయెల్ వ్యతిరేక సంస్థలను వెనకుండి నడిపించిన ఇరాన్ మంగళవారం ఇజ్రాయెల్‌పై 180 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించి ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగింది. దీంతో ఇప్పుడు పశ్చిమాసియాలో అధికారికంగా ఇజ్రాయెల్ %-% ఇరాన్ మధ్య యుద్ధం మొదలయ్యింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్నది.

**ఏ దేశం ఎవరి వైపు?**

ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధంలో ఏ దేశం ఎవరి వైపు నిలవనున్నది అనే అంశం కీలకంగా మారింది. ఇజ్రాయెల్‌కు ప్రధాన మద్దతు అమెరికా నుంచి ఉంది. ఇరాన్ క్షిపణులను కూల్చేయాలని ఇప్పటికీ అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆదేశించారు. ఇజ్రాయెల్‌కు మద్దతుగా పశ్చిమాసియాకు అమెరికా అదనపు బలగాలను మోహరిస్తున్నది. యూకే, ఫ్రాన్స్‌తో పాటు నాటో దేశాల మద్దతు కూడా ఇజ్రాయెల్‌కు ఉండనుంది. మరోవైపు పశ్చిమాసియాలో ఇప్పటికే షియా ముస్లింల కేంద్రమైన ఇరాన్, సున్నీ ముస్లింల మెజారిటీ కలిగిన సౌదీ అరేబియా మధ్య ఆధిపత్య పోరు ఉంది. అమెరికాకు సౌదీ అరేబియా మిత్రదేశంగా కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియాతో పాటు జోర్డాన్ మద్దతు కూడా ఇజ్రాయెల్‌కు ఉండే అవకాశం ఉంది. ఇక, ఇరాన్‌కు సిరియా, లెబనాన్, యెమెన్ మద్దతు ఉంది. ఈజిప్ట్, టర్కీ కూడా ఇరాన్‌కు మద్దతు ఇచ్చే అవకాశం ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి.

**రష్యా దిగితే రణరంగమే!**

రష్యా - ఉక్రెయిన్ యుద్ధం మూడో ఏడాదికి చేరుకున్నప్పటీ సమీప భవిష్యత్తులో యుద్ధానికి ముగింపు కనిపించడం లేదు. ఉక్రెయిన్‌కు లాంగ్ రేంజ్ క్షిపణులు అందించాలనే యూకే నిర్ణయంపై రష్యా ఆగ్రహంగా ఉంది. తమ అణు విధానాన్ని మార్చుకుంటామని ఆ దేశం పదేపదే అమెరికా, నాటో దేశాలను హెచ్చరిస్తున్నది. రష్యాకు పరోక్షంగా చైనా, ఉత్తర కొరియా మద్దతు ఉంది. ఇరాన్‌తోనూ రష్యాకు మంచి సంబంధాలే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా, దాని మిత్ర దేశాలపై ఆగ్రహంగా ఉన్న రష్యా కనుక ఇరాన్‌కు మద్దతుగా నిలిస్తే మూడో ప్రపంచ యుద్ధానికి మరింత చేరువైనట్టే అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in





## వేట్టయాన్ .. వివాదాస్పదంగా మారిన డైలాగ్స్..కేసు నమోదు

సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన తాజా చిత్రం 'వేట్టయాన్-ది హంటర్' ట్రైలర్ బుధవారం విడుదలైంది. ఈ సినిమాలో రజనీకాంత్ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా కనిపించనున్నారు. 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం దసరా సందర్భంగా ఈ నెల 10 ప్రేక్షకుల ముందుకురానుంది. ట్రైలర్ ఆద్యంతం యాక్షన్ అంశాలతో సాగింది. 'క్రైమ్ క్యాన్సర్‌లాంటిది. దానిని పెరగనివ్వకూడదు' 'నన్ను ఏ పోస్టులో తిప్పి కొట్టినా నేను మాత్రం పోలీస్ వాడినే సార్. నా నుంచి వాడిని కాపాడటం ఎవరి వల్లా కాదు' అంటూ రజనీకాంత్ చెప్పిన డైలాగ్స్ హైలైట్‌గా నిలిచాయి. ట్రైలర్‌లో అమితాబ్‌బచ్చన్, రానా, ఫహాద్ ఫాజిల్ పాత్రలను పరిచయం చేసిన తీరు, వారు చెప్పిన డైలాగ్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. రజనీకాంత్ తనదైన ట్కస్టైల్, మేనరిజమ్స్‌తో మెప్పించారు. పోలీస్ వ్యవస్థకు, సంఘ విద్రోహక శక్తులకు మధ్య జరిగే పోరు నేపథ్యంలో సినిమాను తెరకెక్కించారని ట్రైలర్‌ను చూస్తే అర్థమవుతున్నది. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్నందించారు.

నవచిత్ర






## సోనమ్ గోల్డ్ స్కర్ట్ సూట్ స్టన్నింగ్

సోనమ్ కపూర్ పరిచయం అవసరం లేదు. ధనుష్ సరసన రాంజానా లాంటి జాతీయ అవార్డ్ చిత్రంలో నటించిన సోనమ్ పలు సినిమాల్లో అవార్డ్ విన్నింగ్ ప్రదర్శనలతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసింది. ఇటీవల సోనమ్ సినిమాలను తగ్గించి తన బిజినెస్‌మేన్ హబ్బీతో కలిసి విదేశాల్లో నివసిస్తోంది. అయినా సోషల్ మీడియాల్లో నిరంతరం తనదైన ఫ్యాషన్ సెన్స్ తో హాట్ టాపిక్ గా మారుతూనే ఉంది. తాజాగా సోనమ్ గోల్డ్ కలర్ స్కర్ట్ సూట్‌లో మెరిసిపోయింది. ఈవెంట్లో మెరిసే కోచర్ స్కర్ట్ సూట్‌లో కనిపించగా.. ఇది తమరా రాల్ఫ్ 2024 కలెక్షన్ నుండి ఎంపిక చేసుకున్న డిజైనర్ లుక్. దీనికి గొలుసు అలంకరణ.. మోకాళ్ల వరకు ఉన్న దుస్తులకు గోల్డ్ షేడ్స్‌లో ఉన్నాయి. తన అలంకరణకు తగ్గట్టుగా బంగారు నగలతోను అలంకరించుకుంది. చంకీ చైన్ స్టేట్‌మెంట్ గోల్డ్ నెక్లెస్ పెద్ద స్టడ్ చెవిపోగులతో సోనమ్ ఒద్దికగా కనిపించింది.ఈ లుక్ ని డిజైన్ చేసినది ఇంతకీ ఎవరు? అంటే.. మరెవరో కాదు.. ప్రముఖ నిర్మాత, సోనమ్ సోదరి రియా కపూర్ ఈ లుక్ ని డిజైన్ చేసింది. ప్రస్తుతం ఇది అంతర్జాలంలో వైరల్ గా మారింది. సోనమ్ లుక్ కి రియాక్షన్స్ ఒక రేంజులో ఉన్నాయి. ఈ లుక్ అద్భుతంగా ఉందంటూ నటి భూమి పెడ్నేకర్ వ్యాఖ్యానించారు. సోనమ్ భర్త, వ్యాపారవేత్త ఆనంద్ అహూజా వైల్డ్ అని రాశారు. సోనమ్ లుక్‌పైనా, రియా పోస్ట్‌పైనా ఒక అభిమాని వ్యాఖ్యానించాడు. ఫ్యాషన్ ఐకాన్.. ఫ్యాషన్ క్వీన్ అని కొందరు వ్యాఖ్యానించారు. స్కర్ట్ సూట్ లాయలిస్ట్‌లుగా మారుతున్న అనేక మంది ప్రముఖుల్లో సోనమ్ ఒకరు .. బ్లేజర్ ం స్కర్ట్ కాంబినేషన్ తో సోనమ్ ప్రత్యేకతను

## చాలా బాధ కలిగించాయి..
### కొండా సురేఖ కామెంట్స్‌పై మహేశ్ బాబు



టాలీవుడ్ నటి సమంతపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు సినీ, రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. నాగచైతన్య, సమంత విడాకులపై కొండా సురేఖ మాట్లాడిన తీరు పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే సినీ ఇండస్ట్రీ నుంచి స్టార్ సెలబ్రిటీలు సమంతకు మద్దతుగా నిలిచారు. ఈ కామెంట్స్‌ను చిరంజీవి, నాని, వెంకటేశ్, మంచు లక్ష్మి, సుధీర్ బాబు, శ్రీకాంత్ ఓదెలతోపాటు పలువురు తీవ్రంగా ఖండించారు.తాజాగా మహేశ బాబు తన స్పందన తెలియజేశాడు. మంత్రి కొండా సురేఖగారు మా సినీ ప్రముఖులపై చేసిన వ్యాఖ్యలు చాలా బాధ కలిగించాయి. ఓ మహిళా మంత్రి మరో మహిళపై చేసిన ఆమోదయోగ్యంకాని వ్యాఖ్యలు, భాష పట్ల ఓ కూతురి తండ్రిగా, భార్యకు భర్తగా, తల్లికి కొడుకుగా.. తీవ్ర వేదనకు గురయ్యాను. ఎదుటివారి మనోభావాలను దెబ్బతీయనంత వరకు వాక్ స్వాతంత్ర్య స్వేచ్ఛను ఉపయోగించుకోవచ్చు.సినీ పరిశ్రమ వ్యక్తులను సాఫ్ట్ టార్గెట్‌గా మార్చుకోవద్దని పబ్లిక్ డొమైన్‌లో ఉన్న వ్యక్తులను అభ్యర్థిస్తున్నా. మంత్రి చేసిన చౌకబారు, నిరాధారమైన వ్యాఖ్యలను నేను తీవ్రంగా ఖండిస్తున్నా. మన దేశంలోని మహిళలను మన సినీ సోదరులను చాలా గౌరవమర్యాదలతో చూడాలని ట్వీట్ చేశాడు మహేశ్ బాబు.


## కాసం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో అపశృతి.. ప్రియాంక మోహన్‌కు తప్పిన ప్రమాదం :




**మహబూబాబాద్‌-నవభూమి:** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలోని కాసం షాపింగ్ మాల ప్రారంభోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో స్టేజ్ ఒక్కసారిగా కుప్పకూలడంతో పలువురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే..కాసం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా సినీనటి ప్రియాంక మోహన్, పాలకుర్తి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి విచ్చేశారు.

ఈ క్రమంలో షాపింగ్ మాల్ ముందు ఏర్పాటు చేసిన వేదిక పైకెక్కి ప్రజలకు అభివాదం చేస్తుండగా ఒక్క సారిగా కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదం నుంచి సినీనటి ప్రియాంక మోహన్ సురక్షితంగా బయటపడ్డారు. ఝాన్సీ రెడ్డికి తీవ్ర గాయలవడంతో వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

## యువతరంగాన్ని ఉప్పొంగించే వీరుడు కావాలా.. తారక్ దేవర బ్లాక్ బస్టర్ ప్రోమో




జూనియర్ ఎన్టీఆర్ టైటిల్‌రోల్‌లో నటించిన చిత్రం దేవర . కొరటాల శివ దర్శకత్వం వహించిన దేవర రెండు పార్టులుగా తెరకెక్కుతుండగా.. దేవర పార్టు 1 సెప్టెంబర్ 27న థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదలైంది. ప్రపంచవ్యాప్తంగా విడుదలైన చాలా సెంటర్లలో బ్లాక్ బస్టర్ టాక్‌తో స్క్రీనింగ్ అవుతోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ బ్లాక్ బస్టర్ దేవర ప్రోమోను విడుదల చేశారు.జాన్వీకపూర్ హొయలుపోతూ.. అందాలు ఆరబోస్తూ తంగాన్ని ఉప్పొంగించే వీరుడు కావాలా.. అంటూ చెప్పే సంభాషణలతో షురూ అయింది ప్రోమో. సముద్రంలో దేవర గ్యాంగ్ చేస్తున్న సవారి, ఆయుధాల కోసం జరిగే పోరు, దేవర ఫ్యామిలీ ఎమోషనల్ సీన్లతో సాగుతున్న ప్రోమో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.బాలీవుడ్ స్టార్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ భైర పాత్రలో నటించగా.. ప్రకాశ్ రాజ్, మలయాళ యాక్టర్ షైన్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ, హిమజ ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా తెరకెక్కించారు.

## లంక స్పిన్నర్ జయవిక్రమపై ఏడాది పాటు నిషేధం



**కొలంబో-నవభూమి:** శ్రీలంక స్పిన్నర్ ప్రవీణ్ జయవిక్రమ()పై ఏడాది పాటు అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి బ్యాన్ విధించారు. యాంటీ కరప్షన్ కోడ్ ఉల్లంఘించిన కేసులో అతనిపై ఈ చర్యలు తీసుకున్నారు. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన జయవిక్రమపై కేసు బుక్కైంది. మ్యాచ్ ఫిక్సింగ్‌లు, విచారణకు అడ్డుపడిన ఘటనల్లో .. ఐసీసీకి రిపోర్టు చేయడంలో అతను విఫలం అయ్యాడు. 26 ఏళ్ల క్రికెటర్ అవినీతి నిరోధక కోడ్‌ను ఉల్లంఘించినట్లు అంగీకరించాడు. తప్పు ఒప్పుకోవడంతో, అతనిపై ఏడాది పాటు నిషేధం విధించినట్లు ఐసీసీ తెలిపింది. 2021 సీజన్‌లో లంక ప్రీమియర్ లీగ్‌లో ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు జయవిక్రమపై ఆరోపణలు ఉన్నాయి. 2021 ఏప్రిల్‌లో స్పిన్నర్ జయవిక్రమ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో అతను 11 వికెట్లు తీసుకున్నాడు. అతను 5 టెస్టు మ్యాచ్‌లు , 5 వన్డేలు, 5 టీ20 మ్యాచ్‌లు ఆడాడు.

## కరీబియన్ క్రికెట్‌లో కొత్త అధ్యాయం.. ఆ నవరత్నాలకు సెంట్రల్ కాంట్రాక్ట్



**న్యూఢిల్లీ-నవభూమి:** వెస్టిండీస్ క్రికెట్ లో కొత్త అధ్యాయానికి నాంది పడింది. బోర్డుపై అసంతృప్తితో ఫ్రాంచైజీ క్రికెట్ వైపు మొగ్గు చూపుతున్న వేళ కీలక నిర్ణయం తీసుకుంది. ఏండ్లుగా సెంట్రల్ కాంట్రాక్ట్ కోసం నిరీక్షిస్తున్న ఆటగాళ్లకు బోర్డు తీపి కబురు చెప్పింది. తమ దేశ చరిత్రలోనే తొలిసారి ఆటగాళ్లకు ఏడాది కంటే ఎక్కువ రోజుల కాంట్రాక్ట్ ఇవ్వబోతున్నట్టు గురు వారం వెస్టిండీస్ బోర్డు ప్రకటించింది. పురుషుల, మహిళల జట్లలోని తొమ్మిది మంది (నవరత్నాలు) కి సెంట్రల్ కాంట్రాక్ట్ ఇస్తున్నట్టు క్రికెట్ వెస్టిండీస్ తెలిపింది. మల్టీ ఇయర్ కాంట్రాక్ట్‌తో పాటు ప్రతిభావం తులైన యువ కెరటాలకు వార్షిక కాంట్రాక్ట్‌లను బోర్డు ప్రకటి చింది. పురుషుల, మహిళల టీమ్‌ల నుంచి మరో తొమ్మిది మందిని ఏడాది కాంట్రాక్ట్ కింద నమోదు చేశామని వెల్లడించింది. బోర్డు నుంచి స్థిరమైన ఆదాయం అందుకునేవాళ్ల లో వైస్ కెప్టెన్ అల్జారీ జోసెఫ్.. 'గబ్బా టెస్టు హీరో' షమర్ జోసెఫ్ స్పిన్నర్ గుడకేశ్ మోతీ, ఓపెనర్ షాహ్ హోప్, యువ పేసర్ జైడన్ సీల్స్.. మహిళల జట్టు ఆల్‌రౌండర్ హేలీ మాథ్యూస్ , స్టఫానీ టేలర్, క్యాంప్‌బెల్‌లు ఉన్నారు.

నవక్రీడ

## ప్రపంచ కప్ పండుగ షురూ.. బోణీ కొట్టేది ఎవరో..?



**న్యూఢిల్లీ-నవభూమి:** క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్రీడా పండుగ మొదలైంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (లోని షార్జా వేదికగా మహిళల టీ20 వరల్డ్ కప్ వేడుకలు అట్టహాసంగా షురూ అయ్యాయి. అరబ్ దేశం అతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీ ఆరంభ పోరులో స్కాట్లాండ్ తో తలపడుతున్న బంగ్లాదేశ్ బ్యాటింగ్ తీసుకుంది.

షార్జా క్రికెట్ స్టేడియంలో జరుగు తున్న ఈ మ్యాచ్‌లో బంగ్లా ఫేవరేట్‌గా కనిపిస్తున్నా.. స్కాంట్లాడ్ సంచలనం సృష్టించాలనే పట్టుదలతో ఉంది. దాంతో, మొదటి బోణీ ఎవరిదో అని అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. టీ20 వరల్డ్ కప్‌ను విజయంతో ఆరంభించాలనే కసితో ఉన్న రెండు జట్లు పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్నాయి. ఇక.. రాత్రి 7: 30 గంటలకు జరిగే రెండో మ్యాచ్‌లో పాకిస్థాన్, శ్రీలంక జట్లు ఢీ కొట్టనున్నాయి.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**